



# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com





హైదరాబాద్ | గురువారం 4-3-2021 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 182 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# మరింత వేగంగా కరోనా వ్యాక్సినేషన్ ప్రక్రియ

## కీలక నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వం
## వ్యాక్సిన్ 24గంటలూ అందుబాటులో ఉంటుందన్న హర్షవర్ధన్
## వ్యాక్సిన్ వేయించుకున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

న్యూఢిల్లీ,మార్చి3(ఆర్ఎన్ఎ): కరోనా వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి 24 గంటలూ ప్రజలకు వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. ప్రజలు వారికి అనుకూలమైన సమయంలో వ్యాక్సిన్ తీసుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ వెల్లడించారు. వ్యాక్సినేషన్ ప్రక్రియలో వేగం పెంచడానికి సమయంపై పరిమితిని ఎత్తేసినట్లు ఆయన చెప్పారు. ప్రజల సమయం, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొనే ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు హర్షవర్ధన్ తెలిపారు. ఈ సమయం అనేది ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రెండిటికీ వర్తించనుంది. ప్రైవేటు ఆసుపత్రులు వ్యాక్సినేషన్ కోసం ఏ సమయమైనా ఎంచుకోవచ్చని దైనిక్ భాస్కర్ పత్రికలో వచ్చిన కథనంపై మంత్రి స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. కొవిన్ యాప్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 అన్న పరిమితి ఏమీ లేదు. ఆసుపత్రులు కావాలనుకుంటే రాత్రి 8 గంటల వరకూ వేసుకోవచ్చు. లేదంటే ఉదయం 8 గంటలకే ప్రారంభించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి వాళ్లు షెడ్యూల్ ఫిక్స్ చేసుకోవచ్చు అని హర్షవర్ధన్ చెప్పారు. వ్యాక్సినేషన్ సెంటర్ల దగ్గర ప్రజలు గుమిగూడకుండా కూడా ఈ నిర్ణయం ఉపకరిస్తుంది.

ఇదిలావుంటే రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కొవిడ్ టీకా తీసుకున్నారు. ఢిల్లీలోని ఆర్ఆర్ హాస్పిటల్‌లో ఆయన తొలి డోసు టీకాను వేయించుకున్నారు. దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగుతున్న విషయం తెలిసిందే.

60 ఏళ్లు దాటిన వారికి ఉచితంగా టీకాలు ఇస్తున్నారు. 45 ఏళ్లు దాటి.. వ్యాధులు ఉన్నవారికి కూడా ప్రభుత్వ దవాఖానాల్లో ఉచిత టీకాలను ఇస్తున్నారు. ప్రధాని మోదీతో పాటు కొందరు కేంద్ర మంత్రులు ఇప్పటికే కోవిడ్ టీకాను తీసుకున్నారు. ఆయా రాష్ట్రాల సీఎంలు, మంత్రులు కూడా టీకాలు వేయించుకున్నారు. టీకాలు తీసుకోవాలనుకునేవారు.. తొలుత కోవిన్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది.

# రాష్ట్రంలో తగ్గుతున్న కరోనా తీవ్రత

### పెరుగుతున్న కోలుకుంటున్న వారి సంఖ్య

హైదరాబాద్,మార్చి3(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కరోనా తీవ్రత తగ్గుతోంది, కోలుకుంటున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. తాజాగా కొత్తగా 168 కరోనా కేసులు నమోదవగా, మరో 163 మంది బాధితులు కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. దీంతో ఇప్పటిరకు నమోదైన కరోనా కేసుల సంఖ్య 2,99,254కు చేరింది. ఇందులో 2,95,707 మంది బాధితులు మహమ్మారిబారినుంచి బయటపడ్డారు. కొత్తగా ఒక్క మరణం కూడా నమోదవలేదని ఆరోగ్య శాఖ ప్రకటించింది. కాగా, ఇప్పటివరకు ఇప్పటివరకు 1635 మంది మృతిచెందారు. మొత్తం కేసుల్లో 1912 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఇందులో 796 మంది హోం ఐసోలేషన్‌లో ఉన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 29 కేసులు నమోదయ్యాయి. కాగా, రాష్ట్రంలో రికవరీ రేటు 98.81 శాతం ఉండగా, మరణాల రేటు 0.54 శాతంగా ఉన్నదని తెలిపింది. నిన్న ఒక్క రోజే 40,444 మందికి కరోనా పరీక్షలు నిర్వహించామని, మొత్తంగా 88,01,651 నమూనాలను పరీక్షించామని వెల్లడించింది.

# ప్రభుత్వాన్ని విమర్శిస్తే దేశద్రోహం ఎలా అవుతుంది

## ఫరూక్ అబ్దుల్లాపై కేసు కొట్టివేస్తూ సుప్రీం కీలక వ్యాఖ్యలు
## పిటిషనర్‌కు 50వేల జరిమానా విధించిన ధర్మాసనం

న్యూఢిల్లీ,మార్చి3(ఆర్ఎన్ఎ): జమ్ము కశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లాపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వ అభిప్రాయంతో విభేదించే వ్యాఖ్యలు చేయడం దేశద్రోహంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. అంతేకాదు ఈ పిటిషన్ దాఖలు చేసిన వ్యక్తిపై రూ. 50 వేల జరిమానా కూడా విధించింది. జమ్ముకశ్మీర్ లో ఆర్టికల్ 370ను రద్దు చేసి, రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించడంపై గతంలో ఫరూక్ చేసిన వ్యాఖ్యలపై పిటిషన్ దాఖలైంది. జమ్ముకశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక హోదాను భారత ప్రభుత్వం రద్దు చేయడంపై ఫరూక్.. పాకిస్థాన్, చైనా మద్దతు కోరినట్లు పిటిషనర్ ఆధారాలు సమర్పించ లేకపోయారని సుప్రీంకోర్టు చెప్పింది. మొత్తానికి ఫారూఖ్ అబ్దుల్లాకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తనపై దేశద్రోహం కేసు మోపి అరెస్ట్ చేయాలంటూ వేసిన పిటిషన్‌ను దేశ అత్యున్నత న్యాయ స్థానం తప్పు పట్టింది. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా మాట్లాడటం తప్పు కాదని, ప్రభుత్వాలకు భిన్నమైన రీతిలో స్పందించవచ్చని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ హేమంత్ గుప్తాలతో కూడిన ధర్మాసనం బుధవారం పేర్కొంది. అంతే కాకుండా పిటిషన్ వేసిన వారిని 50 వేల రూపాయలు డిపాజిట్ చేయాలని ఆదేశించింది. జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 నిర్వీర్యాన్ని నిరసిస్తూ.. మళ్లీ ఆ అధికారం పొందేందుకు అవసరమైతే చైనా, పాకిస్తాన్ దేశాల సహాయం తీసుకుంటామంటూ ఫారూఖ్ అబ్దుల్లా వ్యాఖ్యానించారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. అయితే ఈ వ్యాఖ్యలు దేశ వ్యతిరేకమైన వ్యాఖ్యలని, దేశ సమగ్రతను దెబ్బతీస్తాయని రజత్ శర్మ, నేహ్ శ్రీవాస్తవలు సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌లో ఫారూఖ్ పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలని, దేశద్రోహం కింద కేసులు నమోదు చేయాలని, ఐపీసీలోని సెక్షన్ 124-ఎ కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై సుప్రీం ఘాటుగానే స్పందించింది. ప్రభుత్వాలకు భిన్నంగా, వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయొచ్చు. దీనిని దేశద్రోహంగా ఎలా పరిగణిస్తాం. ప్రభుత్వాలపై చేసే వ్యాఖ్యలు దేశద్రోహం కిందకు రావు. అవి భావ ప్రకటనా స్వేచ్ఛలో భాగమే అని సుప్రీం ధర్మాసనం పేర్కొంది.

ఆర్టికల్ 370 నిర్వీర్యం అనంతరం జమ్మూ కశ్మీర్‌లోని చాలా మంది నేతలు ఏడాదికి పైగా నిర్బంధంలో ఉన్నారు.

# నిత్య స్మరణీయులు



-దోరవేటి
సెల్:9866251679

## సామ్రాట్ అశోక

బిందుసార సుభద్రాంగి ప్రేమపుత్ర
పాటలీపుత్ర రాజ్య ప్రభవము మెరయ
అఫ్ఘనిస్థాను, పర్షియా, నాసియాల
కేక ఛత్రాధిపతివే అశోక! జయము!

'దేవనాం ప్రియదర్శినీ' యను జగద్విఖ్యాతి గొన్నట్టి స
ద్భావంబోధివి మౌర్య శౌర్య చరితా! ప్రఖ్యాత సమ్రాట్ అశో
కా! వీరాగ్రణి! ధర్మచక్రధర! లోకానంద శాంతిప్రదా!
నీవే నిల్పిన మైలురాళ్ళు ధరణిన్ నిల్చేనయా నేటికిన్.

ధర్మచక్రము జెండా హృదయము నందు
నాల్గు సింహాలు రక్షణ న్యాయమందు
ఎద్దు, జింకయు, ఏనుగు నేర్పడగను
ద్రవ్యమున చిహ్నములునయ్యె తరతరమును.

లక్షల ప్రాణముల్ జనె నిలాతలమందు కళింగలో రణ
క్షేత్రము నందు, నయ్యది విభించెను జాతికి శాంతి పాఠముల్
అక్షయమైన దుఃఖముల నందిన వేళల బుద్ధబోధనల్
రక్షగ నిల్చె మానవ కులమ్మునకు దేశ విదేశ వీధులన్.

# అక్రమ సంబంధం పెట్టుకున్న మహిళను కడతేర్చాడు

### -డబ్బులు తీసుకుని అడిగిన పాపానికి అంతం చేశాడు

వికారాబాద్,మార్చి3(ఆర్ఎన్ఎ): భర్త చనిపోయిన మహిళతో అక్రమ సంబంధం పెట్టుకోవడమే కాకుండా, ఆమె దగ్గర డబ్బులు తీసుకుని మోసం చేశాడో వ్యక్తి. డబ్బుల కోసం అతడిని నిలదీయగా ఆమెను చంపేశాడు. డబ్బులు ఇస్తానని చెప్పి అడవిలోకి తీసుకెళ్లి మహిళను చంపేశాడు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లాలో వారం రోజులు క్రితం జరుగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యాలాల మండలం, పగిద్యాల గ్రామానికి చెందిన బేగరి లక్ష్మి(30) భర్త మృతి చెందడంతో.. పెద్దేముల్ మండలం బండమీదిపల్లి గ్రామానికి చెందిన నర్సింహులు అనే వ్యక్తితో కొన్ని రోజులుగా సహజీవనం చేస్తోంది. ఈ క్రమంలోనే లక్ష్మి.. నర్సింహులుకు రూ. 50వేలు అప్పుగా ఇచ్చింది. అయితే జీవనం లక్ష్మీ ఆర్థిక పరిస్థితి బాగాలేక పోవడంతో.. ఆ డబ్బు తిరిగి ఇవ్వాలంటూ ఎన్నోసార్లు నర్సింహులును బతిమిలాడింది. ఎలాగైనా డబ్బులు ఎగ్గొట్టాలనుకున్న నర్సింహులు పక్కా ప్లాన్ వేశాడు. వారం రోజుల క్రితం పగిద్యాల నుండి లక్ష్మిని డబ్బులు ఇస్తానని తన వెంట తీసుకెళ్లి రాస్నమ్ అడవిలో హత్య చేశాడు. మహిళ అనుమానిత మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు నర్సింహులును అదుపులోకి తీసుకుని విచారించగా నిజం ఒప్పుకున్నాడని తెలిపారు.

# యువతిపై ప్రేమోన్మాది దాడి

### షీ టీమ్‌కు ఫిర్యాదు చేసిందన్న అక్కసుతో ఘాతుకం
### వివరాలు వెల్లడించిన డిసిపి వెంకటేశ్వర్లు

హైదరాబాద్,మార్చి3(ఆర్ఎన్ఎ): నగరంలో కలకలం రేపిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై దాడి ఘటనకు సంబంధించిన మాదాపూర్ డీసీపీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. నిందితుడు షారూఖ్ హర్యానాకు చెందిన వాడని, రెండేళ్లుగా బాధితురాలితో అతడికి పరిచయం ఉందని తెలిపారు. అయితే కొన్ని రోజులుగా వారి ఇద్దరి మధ్య దూరం పెరిగిందని, అతడి వేధింపులు ఎక్కువకావడంతో బాధితురాలు షీ టీమ్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో షీ టీం షారూఖ్‌కు కౌన్సెలింగ్ ఇచ్చిందని డీసీపీ తెలిపారు. ఈ నేపథ్యంలో బాధిత యువతిపై కక్ష గట్టిన నిందితుడు ఆమెపై దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా.. షారూఖ్‌కు గతం లోనే పెళ్ళైందని, భార్య నుంచి విడిపోయిన అతడు విడాకులు తీసుకున్నట్లు డీసీపీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. కాగా ప్రముఖ ఐటీ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన యువతిపై షారుఖ్ కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. హైదర్షాకోట్‌లోని ఆమె నివాసానికి వెళ్లి ఈ ఘాతుకానికి తెగబడ్డాడు. కాగా జావెద్ హబీబ్ సెలూన్‌లో పనిచేస్తున్న షారూఖ్ ప్రేమ పేరిట బాధితురాలి వెంటపడ్డాడు. అయితే యువతికి ఈ ఏడాది మేలో పెళ్లి చేసేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ విషయం తెలుసుకున్న షారూఖ్.. తనతోనే ఉండాలంటూ ఆ యువతిపై ఒత్తిడి చేశాడు.

# స్కూల్లో టీచర్లతో పాటు విద్యార్థికి కరోనా

### -వెంటనే పాఠశాల మూసేసిన అధికారులు

కోరుట్ల,మార్చి3(ఆర్ఎన్ఎ): జగిత్యాల జిల్లాలోని కోరుట్లలో కరోనా కలకలం రేపింది. కోరుట్ల మండలంలోని అయిలాపూర్ ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థితోపాటు ప్రధానోపాధ్యాయుడు, మరో టీచర్‌కు కరోనా పాజిటివ్ వచ్చింది. పాఠశాలలో 9వ తరగతి విద్యార్థికి కరోనా లక్షణాలు కనిపించాయి. దీంతో అతనికి కరోనా పరీక్షలు నిర్వహించారు. అందులో అతనికి పాజిటివ్‌గా తేలింది. దీంతో పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులకు కరోనా టెస్టులు చేశారు. ఫలితాల్లో ప్రధానోపాధ్యాయుడు లోకని శ్రీనివాస్, తెలుగు ఉపాధ్యాయురాలు అనూజకు పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో పాఠశాలను మూసివేశారు. స్కూల్ మొత్తం శానిటేషన్ చేశారు.

# జాతీయ విద్యా విధానంతో దేశీయ భాషలకు ప్రాధాన్యం

### విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్‌పై జరిగిన చర్చలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,మార్చి3(ఆర్ఎన్ఎ): కొత్త జాతీయ విద్యా విధానంలో భారతీయ భాషలకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు ప్రధాని మోదీ తెలిపారు. విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్‌పై జరిగిన చర్చలో వర్చువల్‌గా పాల్గొన్న ప్రధాని మాట్లాడుతూ.. ఈ వ్యాఖ్యలు చేశారు. కొత్త విద్యావిధానంలో భారతీయ భాషలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. అయితే ప్రపంచ స్థాయిలో ఉన్న ఉత్తమ కంటెంట్‌ను స్థానిక భాషల్లోకి తీసుకురావాల్సిన బాధ్యత ఉన్నట్లు చెప్పారు. దీని కోసం తమ బడ్జెట్‌లో ఆరోగ్యం తర్వాత అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. నైపుణ్యం, పరిశోధన, ఆవిష్కరణలకు కూడా అధిక ప్రాముఖ్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆత్మనిర్బర్ భారత్ నిర్మాణం కోసం యువతలో ఆత్మ విశ్వాసం ఉండాలని, తమ విద్య, నైపుణం, జ్ఞానంపై నమ్మకం ఉన్నవారిలోనే ఆత్మవిశ్వాసం ఉంటుందని ప్రధాని మోదీ తెలిపారు. దేశంలో ఉన్న ప్రతిభావంతులను వాడు కోవాలని, భాషా అభ్యంతరాలను, అవరోధాలను అధిగమించాలన్నారు. భారత్ ఐటీ వల హైడ్రోజన్ వాహనాన్ని టెస్ట్ చేసిందని, ఇక మన పరిశ్రమ హైడ్రోజన్‌ను రవాణా కోసం ఇంధనంగా వాడుకోవాల న్నారు. భవిష్యత్తు ఇంధనం, గ్రీన్ ఎనర్జీ స్కీమ్‌లు చాలా ముఖ్యమైనవని, దేశాన్ని ఇంధన సమృద్ధిగా మార్చేందుకు అవి ఉపకరిసా యన్నారు. అందుకే హైడ్రోజన్ మిషన్‌ను తాజా బడ్జెట్‌లో పొందుపరిచా మని, ఇదో భారీ విప్లవం అని మోదీ అన్నారు.

# హైకోర్టులో నిమ్మగడ్డకు చుక్కెదురు

## రీ నామినేషన్ ఆదేశాలు నిలిపివేత

అమరావతి,మార్చి3(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్‌కు ఎదురు దెబ్బ తగిలింది. మున్సిపల్ ఎన్నికల్లో రీ నామినేషన్‌కు అవకాశం ఇస్తూ జారీ చేసిన ఆదేశాలను బుధవారం హైకోర్టు కొట్టివేసింది. కొత్తగా మున్సిపల్ నామినేషన్లకు అవకాశం ఇవ్వొద్దని స్పష్టం చేసింది. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి వార్డు వాలంటీర్లపై ఎస్ఈసీ జారీ చేసిన ఆదేశాలను కూడా కొట్టేసింది. వాలంటీర్ల ట్యాబ్‌లను స్వాధీనం చేసుకోవద్దని సూచించింది. కాగా, తిరుపతి కార్పోరేషన్‌లో ఆరు, పుంగనూరు మున్సిపాలిటీలో మూడు, కడప జిల్లా రాయచోటిలో రెండు ఏకగ్రీవాలలో రీ నామినేషన్‌కు అవకాశం కల్పిస్తూ ఎస్ఈసీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నామినేషన్ వేయకుండా అడ్డుకుని బలవంతంగా ఏకగ్రీవం చేయించుకున్నందునే రీ నామినేషన్‌కి అవకాశమిస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు.అంతేకాదు.. వార్డు వాలంటీర్లను మున్సిపల్ ఎన్నికల విధుల నుంచి దూరంగా ఉంచాలంటూ ఆదేశాలు జారీ చేశారు. వారి ఫోన్లను స్వాధీనం చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

# 14 మంది మృత్యువాత

వాషింగ్టన్,మార్చి3(ఆర్ఎన్ఎ): అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దక్షిణ కాలిఫోర్నియా- మెక్సికో సరిహద్దులోని స్టేట్ రూట్ 115, ఇంపీరియల్ కౌంటీలోని నోరిష్ రోడ్‌లో ఉదయం 6.15 గంటల ప్రాంతంలో యూఎస్‌వీ కారును ట్రక్కు ఢీకొట్టింది. ఈ ఘటనలో అక్కడికక్కడే 14 మంది మృత్యువాత పడగా.. హాస్పిటల్‌కు తరలించగా ఒకరు మృతి చెందారు. మరో పది మందికిపైగా గాయపడగా హాస్పిటల్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఎనిమిది మంది కూర్చోవాల్సిన వాహనంలో సుమారు 27 మంది వరకు ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుల్లో పది మంది మెక్సికన్ పౌరులు ఉన్నారని, మరో ముగ్గురి జాతీయత తెలియలేదని పేర్కొన్నారు. వాహనంలో ఉన్నది రెండు సీట్లేనని.. ఎనిమిది మంది వరకు వెళ్లొచ్చని.. ఇంత మంది ఎలా వెళ్లారో తెలియడం లేదన్నారు. ప్రమాదంలో ప్రతి ఒక్కరూ గాయపడ్డారని చెప్పారు. స్వల్ప గాయాలపాలైన వారిని హాస్పిటల్ నుంచి డిశ్చార్జి చేసినట్లు చెప్పారు. ప్రమాదంలో 15 మంది మృతి చెందారని హైవే పెట్రోలింగ్ విభాగం అధికారులు పేర్కొన్నారు. యూవీని ట్రక్కు బలంగా ఢీకొట్టడంతో అందులో చిక్కుకున్న వారిని, మృతదేహాలను వెలికి తీసేందుకు శ్రమించారు. బాధితులంతా 15 నుంచి 53 ఏళ్ల వయసున్న స్త్రీ, పురుషులు ఉన్నారని అధికారులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు జరుపుతున్నట్లు జాతీయ రవాణా భద్రతా బోర్డు తెలిపింది. ప్రమాదంలో మెక్సికన్లు మృతి చెందడంపై అక్కడి ప్రభుత్వం విచారం వ్యక్తం చేసింది.

# జర్నలిస్టుల సమస్యలపై మంత్రి కేటీఆర్‌తో అల్లం నారాయణ భేటీ

హైదరాబాద్ , మార్చి 3: పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలపై చర్చించేందుకు రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ నేతృత్వంలోని బృందం బుధవారం మంత్రి కేటీఆర్‌తో సమావేశమైంది. ఈ సందర్భంగా ప్రెస్ అకాడమీకి ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు, జిల్లా కేంద్రం అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లోని జర్నలిస్ట్ లకు ఇల్లు లేదా ఇళ్ల స్థలాలు ఇవ్వడం, హైద్రాబాద్ లోని జర్నలిస్ట్ లకు ఇల్లు కల్పించడం, జవహర్ లాల్ నెహ్రూ సొసైటీకి పెట్ బషీరాబాద్‌లోని స్థలాన్ని కేటాయించడం, చిన్న పత్రికల గ్రేడింగ్‌తో పాటు అనేక సమస్యలపై మంత్రితో చర్చించారు.

కరోనా సమయంలో బాధిత జర్నలిస్ట్ లకు ఒక్కొక్కరికి రూ. 20 వేల చొప్పున అందజేసిన ప్రెస్ అకాడమీ ఛైర్మెన్ అల్లం నారాయణను మంత్రి కేటీఆర్ అభినందించారు. చనిపోయిన జర్నలిస్ట్ కుటుంబాలకు సహాయనిది అందజేసే కార్యక్రమనికి ఈనెల 7వ తేదీన హాజరుకావాలని అల్లం నారాయణ ఈ సందర్భంగా కోరగా అందుకు మంత్రి కేటీఆర్ అంగీకరించారు. జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని దేశంలో ఎక్కడా ఏ ప్రెస్ అకాడమీ కూడా పనిచేయని విధంగా తెలంగాణ మీడియా అకాడమీ పనిచేస్తూ ప్రభుత్వ సహకారంతో అనేక రకాలుగా సేవలు అందిస్తున్నదని కేటీఆర్ గుర్తుచేశారు. మిగిలిన సమస్యలన్నింటీని కూడా కొలిక్కి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తానని ఇళ్ల సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి కూడా సుముఖంగా ఉన్నట్లు కేటీఆర్ చెప్పారు. ఈ సమావేశంలో మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, బాల్క సుమన్, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, టీఈఎంజేయూ అధ్యక్ష కార్యదర్శులు ఇస్మాయిల్, రమణ, హైద్రాబాద్ యూనిట్ అధ్యక్షుడు యోగనందం, ఫోటో జర్నలిస్ట్ అధ్యక్షుడు భాస్కర్ పాల్గొన్నారు.

# మాతృ భాషకు పట్టం కడదాం -డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి...




అన్నింటా మాతృ భాషకు పట్టం కడదామని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 21, ఆదివారం నాడు ఉదయ సాహితి ,అక్కెపల్లి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో.. నిర్వహించిన అంతర్జాతీయ భాషాదినోత్సవం,సినారె పురస్కార ప్రదాన సభకు ఆయన ముఖ్యఅతిథి గా హాజరై డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన "తెలుగు సౌరభాలు" పద్యసంకలనాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.

తెలుగు భాషను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరుముందుకు రావాలని కోరారు.కవులు పద్య రచనలో ఆసక్తి చూపాలని అనేక చారిత్రక అంశాలను పద్యరచనలో తీసుకు రావాలని కోరారు.పద్య రచనలో భావస్ఫోరకమైనఅంశాలకు చోటు కల్పించాలని కోరారు.విశిష్ట అతిథిగా హాజరైన ప్రముఖ కవి విమర్శకులు దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ "పద్యాన్ని కాపాడుకునే బాధ్యత కవులపై ఉందని" పేర్కొన్నారు."హృదయాలను హత్తుకునేలాపద్యాలను రచించాలని కోరారు".

ఉదయసాహితి అధ్యక్షులు డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన కరీంనగర్ లోని గణాంకభవనంలో జరిగిన కార్యక్రమంలో పద్య కవితా సదస్సు అధ్యక్షులు రామక విఠల శర్మ పద్య కావ్యాన్ని పరిచయం చేశారు.డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ ప్రభాకర్ తన సంపాదకత్వంలో పద్య కావ్యం వెలువరించడం ఆనందదాయకం అని అన్నారు.

అక్కెపల్లి ఫౌండేషన్ సినారె విశిష్ట పురస్కారాలు: అక్కెపల్లి ఫౌండేషన్ పక్షాన అక్కెపల్లి బాల్ రెడ్డి తమ కూతురు మమత స్మారకార్థం...సినారె విశిష్ట పురస్కారాలను సాహితీకారులకు అందజేశారు.అక్కెపల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకులు అక్కెపల్లి బాల్ రెడ్డి మాట్లాడుతూ సినారె భాషణం,కవిత్వం తనను ఆకర్షించాయని తన కూతురు స్మారకార్థం సినారె విశిష్ట పురస్కారం ఏర్పరిచానని గతంలో మలయశ్రీ,నలిమెల భాస్కర్,అన్నవరం దేవేందర్ లకు అందించామని ప్రస్తుతం నగదు పురస్కారంతో ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

**-పురస్కార గ్రహీతలు వీరే:**-అన్నాడి గజేందర్ రెడ్డి, గులాబీలమల్లారెడ్డి, ఇష్రత్ సుల్తానా, గంప ఉమాపతి, దారం శ్రీ నివాస్, మెరుగు ప్రవీణ్ పెంచాల రంగారావుఈ కార్యక్రమంలో వి.ఆర్ గణపతి..సంపత్ కుమార్, డాక్టర్ కలువకుంట రామకృష్ణ, టి.వెంకటరమణ,లేదాళ్ళ రాజేశ్వరరావు,కసిరెడ్డి జలంధర్ రెడ్డి,విజయశ్రీ, డి.శంకరయ్య, యం.చంద్రయ్య,ప్రేమ్ సాగర్ రావు, సిరిపురం వాణిశ్రీ,మెరుగు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేటి నిజాలు


గతంలోని బంధాలన్నీ జ్ఞాపకాలుగా మారితే
వర్తమానం వసంతంలా పరిమళిస్తుంది
ఒరిగిపోతున్న పొద్దులో.. ప్రతిక్షణం
దాంపత్యబంధం ఉదయగానరాగమవుతుంది

ఒకరికొకరు తోడుగా ఆ తీయనిబంధంలో
నవచైతన్యం ఊపిరిపోసుకుంటుంది
జీవనప్రస్థానంలో
ఆ బంధమే... పవిత్రబంధమవుతుంది..!

- కెరె జగదీష్




## చరిత్రలో నేటినిజం



కం॥ ఆరుదశాబ్దంబులుగా
పోరగ రోలకు చమురు పలుపాత్రల లోనన్
వేరుమ ప్రఖ్యాతి గానె
తీరగు నటన మ్ము నూడ "దీనా పాఠక్"!!

-రాధశ్రీ




( మార్చి 4 అలనాటి హిందీనటి దీనాపాఠక్ జయంతి..) సెల్: 9494481210


నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం








నేటినిజం

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 4-3-2021

**నమ్మలేని నిజాలు**

విష జంతువు
విజ్ఞాన సంపన్నుడు
విశ్వంలో వాడే!

గాడిద గుఱ్ఱం
ఏ దానికదే గొప్ప
జీవ లక్షణం.

చేతిరాతలు
వాళ్ల తలరాతలు
వట్టి గీతలు.

విశ్వాస ప్రాణుల
పెంపుడు జంతువులు
మనిషి కాదు.

కుప్పి గంతులు
తెలివి తెల్లారింది
ఓటమి భయం.



- రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

పెట్రోలూ డీజిల్ గ్యాస్
పెరుగుతుంది గుట్టోలే !
పేదవాడి మట్టిగుండె
మండుతుంది చుట్టోలే!.

గ్యాసు ధరను చల్లించక
చివరకదే దిక్కు గొయ్యి!
అక్కమొగడు దొరికినట్టు
పెట్టండి కట్టెల పొయ్యి!



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## 'ద్వానా శాస్త్రి' బహుమతుల ప్రదానం



ద్వా.నా.శాస్త్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ద్వానా.శశికాంత్, శైలజామిత్ర, డా॥ కె.వి.రమణాచారి, బైస దేవదాసు, మద్దాళి రఘురాం, డా॥ఓలేటి పార్వతీశం, కళా జనార్ధనమూర్తి, కటుకోజ్వల రమేశ్.

ద్వానా.శాస్త్రిని జ్ఞాపకం చేసుకుంటూ కవితల పోటీలు నిర్వహించడం విశేషమని ప్రభుత్వ సలహాదారు డా॥ కే.వి.రమణాచారి అన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో గురువారం త్యాగరాయ గానసభలో ప్రముఖ రచయిత, విమర్శకుడు డా॥ ద్వా.నా.శాస్త్రి రెండో వర్ధంతి సందర్భంగా 'నాన్న' కవితల పోటీ విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం జరిగింది, కిన్నెర-ద్వానా కుటీరం- నేటినిజం దినపత్రిక పురస్కారాల కవితల పోటీల విజేతల్లో మొదటి బహుమతిని కమలేష్, ద్వితీయ బహుతిని చొక్కాపు లక్ష్మినాయుడు, తృతీయ బహుమతిని కటుకోజ్వల రమేష్‌లతో పాటు ప్రత్యేక బహుమతిలను రెడ్డి రమాదేవి, వెంకటేష్ పువ్వాడ, మరుగొండ సాయిలు, బి. కళాగోపాల్, చిట్టేల శ్రీధర్‌కుమార్‌లు అందుకున్నారు. ప్రముఖ సాహితీవేత్త డా॥ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన సభలో కళా జనార్ధనమూర్తి, బైస దేవదాసు, శైలజామిత్ర, మద్దాళి రఘురామ్ పాల్గొన్నారు. ద్వానా.శాస్త్రి కుమారుడు ద్వా.నా. శశికాంత్ వందన సమర్పణ చేశారు.

## కళాకారులు, రచయితలను ఆదర్శంగా తీసుకోవాలి



పురస్కార గ్రహీతలతో అతిథులు.

నేటితరం యువత కళాకారులను, రచయితలను ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ అయాచితం శ్రీధర్ అన్నారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలోని అడవి మామిడిపల్లిలో ఉన్న అపురూప వేంకటేశ్వర ఆలయ కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన ఇందూరు భారతి స్వర్ణోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమానికి శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏండ్లుగా ఇందూరు భారతి ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు నేటి యువతకు ఆదర్శమని అన్నారు. అనంతరం దారం గంగాధర్, నల్లవరపు చిన్నయ్య రచించిన మాతృదేవోభవ, నడవడిక సంపుటిలను ఆయన ఆవిష్కరించారు. పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్ పొందిన అల్లంగారి జ్యోతి, సయ్యద్ అఫ్రీన్‌బేగంతో పాటు రామ్మోహన్‌ను సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, విజయ్ విద్యాసంస్థల చైర్‌పర్సన్ డా॥ అమృతలతారెడ్డి, తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొ॥ డాక్టర్ త్రివేణి, డా॥ కనకయ్య, ఇందూరు భారతి అధ్యక్షుడు సూర్యప్రకాశ్, కార్యదర్శి రామస్వామి,, రచయితలు,కవులు పాల్గొన్నారు.

### మహిమాన్వితం

ఆమె శక్తి రూపిణి
సృష్టి చలన కారిణి
ప్రతి సృష్టి మాత
ఆ శక్తిని తక్కువ చేసి చూడకు
పృధ్విని గెలిచే ఆకాశాన్ని ఎలి రంగం ఏది అయిన
ఆమె నిరూపమానం స్వారూపం
ఆమెను గౌరవిద్దాం
గుర్తిద్దాం
భారత జాతిని నిర్మిద్దాం
ఒక స్త్రీ అభివృద్ధి చెందితే
కుటుంబమే అభివృద్ధి
అది ఒక చక్రియప్రభావం
ఒక నిర్భయ ఒక ప్రియాంక
లాంటి సంఘటనలకు
చరమగీతం పాడుదాం



-ఉమారాణి వైద్య
9000346200

### బతుకు వాకిలి

తొలివెలుగుల సంతకం
సంబరంగా పలకరిస్తుంటే
సంవాదాలు సంవేదనలు
కాసేపు మరవొచ్చు
వెరపేలేని జీవితంలో.

మెరుపులు మరకలు కలిసిపోయిన రాత్రి
కిసుక్కున నవ్వి చిటికేసి వెళుతుంది
రాత్రి కలుద్దామంటూ
అప్పగింతలు చెబుతుంది.

కష్టమో నిష్ఠూరమో
'పగ'లు వగలు పక్కనపెట్టి
పగలంతా యంత్రమై కదలాల్సిందే
పని కప్పం కట్టాల్సిందే.

కాలనాళిక పాళీ కరుకే
నిజాలు లిఖిస్తుంది కదా
నిట్టూర్పుల ఓడను దిగి
ఓర్పే కూరిమిగా పదవోయ్
బతుకు వాకిలి పిలుస్తోంది.



-సి.యస్.రాంబాబు
8374818961

భల్లం భాష్యం

## విమర్శ ప్రాంతీయ 'లేబుల్'కాదు- పరిపూర్ణ అస్థిత్వం..!!

చేతి కొచ్చినట్టు ఏది పడితే అది రాయడమే గానీ తాను రాస్తున్న దానికి అర్థం ఉందా? లేదా? అది సమాజానికి ఎంత వరకూ ప్రయోజనకారి అవుతుందా.. లేదా..? అని కవి, కథకుడు, విమర్శకుడు ఈ మధ్య చూసుకోవడం లేదు" అది ఒకానొక సాహిత్యాభిమాని ఆవేదన. ఆ ఆవేదనలో ఆ ఆలోచనలో ఎంతో కొంత అర్థంతో కూడిన ఉక్రోషం ఉన్న మాట నిజమే కావచ్చు. కానీ- ఆ ఆవేదనలోని అర్థం అందరికీ అన్నివేళలా అణువణువూ వర్తిస్తుందనీ చెప్పలేం. ఏ కొందరి కుహనా కవులకో, కథకులకో విమర్శకులకో, ఆయా కొన్ని సమయాలలో మరికొన్ని సందర్భాల్లో వ్యక్తమై వ్యర్థమవుతుందంటే..

నేడు సాహిత్యం మీద సమీక్షలు వస్తున్నాయే తప్ప, లోతైన విమర్శనా వ్యాసాలు అంతగా రావడం లేదు. అందుకు కారణం ఒకరకంగా చెప్పాలంటే విమర్శకుడి నిబద్ధతా లోపమే అనుకోవాలి. "ఇస్తినమ్మా వాయినం- పుచ్చుకొంటినమ్మా వాయినం" అన్నట్లు "నా రచనను నీవు పొగుడు. నీ రచనను నేను మోస్తా.." అని సంవిధానంలో సాహితీ విలువలే తగ్గిపోతున్నాయి.

విమర్శ అనే పదానికి- చక్కగా చొచోట, వెదకుట అనీ, విమర్శకుడంటే- ఏ పనియైనా చక్కగా యోచించువాడు అంటే పనిశీలించేవాడు. అవగాహన చేసుకునేవాడు. సత్యం యొక్క సారాన్ని, సారభూతమైన సిద్ధాంతాన్ని వెలికి తీసేవాడు.

సమీక్ష, విమర్శ రెండూ ఒక్కటే అన్న ధోరణిలో కొంత మంది ఉంటారు. అవి రెండూ ఒకటే కావు. సమీక్ష అన్నది నూతనంగా వచ్చిన రచనను పరిచయం చేస్తూ, పుస్తకంలో చర్చించిన అంశం, విధానం ప్రత్యేకతలు మొదలైన వివరాలు తెలుపుతూ పాఠకుడికి ఒక అభిప్రాయం అందివ్వడం. తద్వారా పాఠకుడు ఆ రచన చదవాలో వద్దో నిర్ణయించుకుంటాడు.

సాహిత్యంలో విమర్శ అవసరం. అది సహేతుకంగా ఉండాలి. సరియైన దిశాదశలను నిర్దేశించాలి. సరియైన విమర్శ లోపించినప్పుడు ఉత్తమ సాహిత్యం ఉత్పన్నం కాదు. సాహిత్యంలో విమర్శకుని పాత్ర గొప్పది. కనుక విమర్శకుడు నిబద్ధతతో రచనా వ్యాసంగం చేయాలి. విమర్శకుడికి స్వేచ్ఛ అత్యవసరం. కాబట్టి అతన్ని సంకెళ్లతో బిగించకూడదు. అప్పుడే పలు సాహితీ ప్రక్రియలపై వచ్చే సహేతుకమైన విమర్శనా వ్యాసాలు, ఆయా కవుల మనో వైశ్లేషణకు, ఆత్మ పరిశీలనకు, ఆత్మ పరిశోధనకు నాంది కాగలవు. తద్వారా ఉన్నతమైన మానవీయ విలువలు కలిగియున్న సాహిత్యం సృజనకాగలదు.

ఉత్తమ విమర్శ సాహిత్య రచనను హేతుబద్ధంగా చర్చిస్తుంది. పుస్తకంలోని వస్తువును లేదా విషయాన్ని అన్ని పార్శ్వాల్లో పరిశీలించి దాని మూల స్వభావాన్ని, స్వరూపాన్ని విమర్శించే ప్రయత్నం చేయడం, విమర్శ రచన లోతుల్ని తెలియచేస్తుంది. సాహిత్యంపై హేతుబద్ధమైన విమర్శనా వ్యాసాలు రానంత వరకు ఉత్తమ విలువలు ఉన్న సాహిత్య సృజన జరగదు.

విమర్శ వ్యక్తీకరణ రెండు రకాలుగా వుంటుంది. ఉన్నది ఉన్నట్టుగా రాయడం వొకరకం. ఉన్న వాస్తవికతని వొక దృక్పథంతో చూసి, బేరీజు వేసుకొని రాయడం మరోరకం. ఈ రెండు రకాల విధానాలు ఆయా సందర్భాలు ఆయా విధాలుగా వినియోగించబడుతుంటాయి. మనస్తత్వపరంగా మానసిక పరంగా, సాహితీజనం మనోభావాల్నీ, ప్రవృత్తుల్నీ ఆలోచనా సరళినీ గమనించినప్పుడు సాధారణంగా కొంతమంది విమర్శకులు-సీనియర్, జూనియర్ కవుల రచనల పట్ల విముఖత, వివక్షత చూపుతుంటారు. అది పెద్ద తప్పుగా భావించవచ్చు.

సాహిత్యంలో జరిగిన విమర్శ 'రాశి'లో విస్తారంగా అనిపించినా "వాసి" విషయంలో కొంత అసంతృప్తి ఉన్న మాట వాస్తవమే అనిపించక మానదు. విమర్శల్లో ప్రమాణాలు పడిపోతున్నాయనడంలో అంతో ఇంతో నిజం లేదని మాత్రం అనలేం. ఈ మాత్రం ధైర్యం ఉన్నవారు కూడా లేరు. అంతో ఇంతో కాదు చాలా నిజం వుందని, కొందరు గొంతు వెనుక గొణుగులు అడపాదడపా వినిపిస్తున్నాయి కూడా.

> **అన్ని ఇజాల అంతిమసారం 'హ్యూమనిజం' మాత్రమే. కాలగమనంలో కొందరి విమర్శలకు ప్రాధాన్యం పెరగవచ్చు. మరికొన్ని సార్లు తగ్గవచ్చు.**

విమర్శ కాగితాలలో కాకుండా, జీవితాలలో వికసిస్తే బహుమంచిది. నైరూప్యమైన వచన విమర్శించడానికి రూపుదిద్దడానికి వీలుకాని స్పర్శ, వ్యక్తీకరించడానికి చక్కని చూపు గొప్ప సమన్వయంతో ఉన్న మూర్తిమంతంగా పాఠకున్ని మంత్రముగ్ధుల్ని చేస్తుంది. ఆ విమర్శనాత్మక దృశ్యాన్ని రూపుదిద్దడంలో విమర్శకుని ప్రతిభ వ్యక్తమౌతుంది.

విమర్శ నాడి ఎలా పట్టుకోవాలన్న ప్రశ్న నేటిది కాదు.చిరకాలం నుంచీ వస్తున్నదే. విమర్శ గురించి కాదు గానీ, రచనని గురించి చెబుతూ అది జీవితానికి అనుకరణ అని ప్రాచీనులు అంటూనే, ఈ అనుకరణ వస్తువు సత్య స్వరూపాన్ని ఆవిష్కరించిందని, అది సత్యానికి రెండింతలు దగ్గరగా వుంటుంది. కనుక అది తాత్త్వికంగా అంగీకరింపదగ్గది కాదనీ అన్నారు.

విమర్శ అన్నది ఒక్కొక్కరు ఒక్కోలా చేస్తుంటారు. కొందరి విమర్శకి ఆలోచన ప్రేరణ కావచ్చు. మరి కొందరిని అభిప్రాయాలు ప్రేరేపించవచ్చు. వ్యక్తిగతంగా, సామాజికంగా వున్న సమస్యలు విమర్శకి కారణం కాకూడదు. ఇవన్నీ ఆయా సందర్భానికీ సన్నివేశాలకు- వ్యక్తిగత అభిప్రాయానికీ, అనుబంధాల కారణాలకి సంబంధించినవి. కానీ వాటన్నింటినీ విమర్శకుడు అధిగమించి, ఎలా వ్యక్తపరచాడన్నదే ముఖ్యం. ఎంత బలంగా ఆవిష్కరించాడన్న దాన్ని బట్టి.. ఆ విమర్శనాత్మక దృష్టి ఆధారపడుతుంది.

కొందరి విమర్శనాత్మక రచనలు చూస్తే అసంతృప్తికి లోనుకాక తప్పడం లేదు. లెఫ్టిజకు, రైటిజకు, మార్క్సిజకు, దళితిజకు, ఫెమినిజకు, మైనార్టిజకు, వెనినిజకు, మావోయిజకు, గాంధీఇజకు, రేషననిజకు అంటూ ఏదో ఒక ఇజానికి పరిమితమవుతున్నాయి. అన్ని ఇజాల అంతిమసారం 'హ్యూమనిజం' మాత్రమే. కాలగమనంలో కొందరి విమర్శలకు ప్రాధాన్యం పెరగవచ్చు. మరికొన్ని సార్లు తగ్గవచ్చు. అంత మాత్రం చేత వాళ్ళ విమర్శనాశక్తి అంతరించిందని చెప్పలేం కదా.



-ఎస్.ఆర్.భల్లం
సెల్: 9885442642

### మహిళా లోకం

ఆమె ఒక ఉక్కు మహిళ
తండ్రి దగ్గర నేర్చుకున్న
రాజకీయ చతురత
వ్యక్తిత్వం నేర్పిన విజ్ఞత
ఆమె మన ప్రియతమ
ప్రధాని ఇందిరాగాంధీ.

ఆమెనడుం బిగించింది
బిడ్డను వీపుకు తగిలించింది
ఖడ్గం చేత బట్టింది
తెల్లదొరలపై పోరాడింది
ప్రాణాలు పోతున్నా
శత్రువుని చీల్చిచెండాడింది
ఆమె మణికర్ణిక లక్ష్మీబాయి

ఆడవాళ్ళ వెనుక బాటుతనం
సంస్కారం లేని జీవితం
విద్య లేని జీవితం
చలించిన ఆమె
నడుంకట్టింది
స్త్రీజనోద్ధరణకై
ఆమె మన సావిత్రి పూలే.
ఆమె
నైటింగేల్ అని పిలువబడింది
ఉన్నతవిద్యావంతురాలు
ఆమె వ్రాసిన కవితలు
ఆమెకున్న జ్ఞానానికి గుర్తులు
మొదటి మహిళా గవర్నర్
ఆమె మన సరోజినీ నాయుడు

ఎంతోమంది మహిళామణులు
పోరాడుతూనే ఉన్నారు
ఆనాటినుండి
ఈనాటివరకు
అస్తిత్వాన్ని వెతుక్కుంటూ
వెళ్తునేఉన్నారు
వారిని ఆపడం
ఎవరితరం.
ఎన్ని తేడాలు ఉన్నా
పురుషలోకం
చిన్నచూపు చూసినా
హింసను ఎదుర్కొంటున్నా
ఇంట బయట రక్షణ కరువైనా
ఉద్యోగాలలో
చట్టసభలలో
సరైన స్థానం
దక్కకపోరాడుతూనే
ముందడుగు వేస్తూనే
సాగిపోతోంది నేటి మహిళ
మహిళా దినోత్సవం
సందర్భంగా
మహిళా లోకానికి
నమస్సుమాంజలి



-అరుణ డేనియల్
9000606889

### జాగ్రత్త

ఎంతలా బ్రతికిన
చావక తప్పదు
ఎంత ఎదిగిన
కృంగక తప్పదు!!.

ఏది మారిన
తలరాత మారదు
గాయం మానిన
నొప్పి మానదు!!.

తినే తిండి
ఒంటదు ఒంటికి
ఒళ్లనే బండి
తప్పదు కాటికి!!.

పుణమైన పాపమైన
తప్పదు చావు
బాగున్న ఆరోగ్యమైన
నీదైవచ్చును చావు!!.

కూరోద్దు పప్పొద్దు
చచ్చే బొందకు
ప్రాణం మీద తీపొద్దు
భయపడకొచ్చే చావుకు!!

అందంమీద మోజెందుకు
ఎముకలేగ మిగిలేది
కండల ఒళ్లెందుకు
శవమేగా చివరకయ్యేది!!.

కుల్లొదన్న కుతంత్రముతో
ఆగిపోయే నీఎదకు
కుళ్ళిపోయే బొందతో
నీచపనులే సేయకు!!

పైనుంచి పిలుపొచ్చిన
చావు వచ్చును
నీచావు జనమెచ్చిన
గుర్తులే నిలిచిపోవును!!

ఓఅన్నోయ్ జాగ్రత్త
జీవం నిర్జీవమై
నేలమీద తీరునుగుత్త
పాపాలేపండి తేలుదువుశవమై!!

చేయకు తప్పులు
మంచోడివైన చచ్చేవు
విడువు నీచబుద్దులు
మోక్షంతో హాయిగొచ్చెచావు!!




-మల్లె రంజిత్ కుమార్
7032650908

పుస్తక సమీక్ష

## నవ్వు నాలుగిందాల మేలు







నవరసాలన్నింటికెల్లా 'నవ్వురసం ప్రశస్తమైనది. ప్రయోజనకరమైనది కూడా! నవ్వు నాలుగిందాల చేటు అన్నది ఏనాటి సామెతో అయితే, నవ్వు! నాలుగిందాల ఆరోగ్యంగా ఉండు!! అన్నది నేటి సామెత.

అమెరికాలో స్థిరపడిన మన వంగూరి చిట్టెన్ రాజు (హ్యూస్టన్ టెక్సస్) తాను 'కన్నవీ, విన్నవీ, ఊహించినవీ-కామెడీ కబుర్లుగా, కథలుగా మార్చి మనకందిస్తున్నారు. నిజానికి 'కథలు' అంటే కల్పితాలు. రచయిత ఊహాపరిధి మేరకు విస్తరించి, పాఠకులకు మానసికోల్లాసం కలిగిస్తాయి. సంపుటిలో ఇచ్చిన ఇరవయికి పైగా 'కథల' నేపథ్యం యదార్థాలు. అందుకే పుస్తకానికి ఇచ్చిన శీర్షికకు 'కమామీషులు' అన్న పదాన్ని జోడించినట్లు చెప్పుకున్నారు. తాను ఇంత వరకు 10 ఇలాంటి పుస్తకాలు తీసుకొచ్చాననీ ఇది తన 11వ పుస్తకం అని చెబుతూ, తనకు తానే 'Not Bad బిడ్డ' అని కితాబు ఇచ్చుకున్నారు.

కబుర్లలో సింహభాగం ప్రథమ పురుషలో ఉంటూ భాష భావం వివరణ ఈ మూడింటిలోనూ, పాదరసంలా హాస్యరసం తొణికిసలాడుతుంది. పాఠకుల మనస్సులను అలా అలవోకగా గిలిగింతలు పెడుతూ, పెదాలపై సన్నని నవ్వు రేకలు పూయిస్తారు.

సాహిత్యం ఒక నిరంతర ప్రవాహం. కాలానికి అనుగుణంగా సాగిపోతూ ఎప్పటికి ఎయ్యది ప్రస్తుతమొ, ఆ రూపు దాల్చుతూ సాగిపోతుంటుంది. పౌరాణిక కావ్యాలు, దేశభక్తి, అపరాధ పరిశోధన, ప్రేమ, త్యాగం ఆకలి అణచివేత, అంటరానితనం లాంటి నేపథ్యాల నెన్నింటినో తనలో వెలయించుకుని, ఇప్పుడు సాఫ్ట్‌వేరు, గ్రహాంతర ప్రయాణాలు, కంప్యూటర్లు, వైరసుల కాలంలోకి ప్రవహిస్తున్నది. అయితే నాటినుంచీ, నేటి వరకూ ప్రవాహంలో అడుక్కు చేరకుండా నిలుస్తున్నది హాస్యం. ఇన్నేళ్ళయినా, పానుగంటివారినీ, చిలకమర్తి, మొక్కపాటి వారిని తెలుగు ప్రజ ఆదరిస్తున్నందుకు కారణం వీరి రచనలు హాస్యరస పూరితాలు కనుక! ప్రపంచ వ్యాప్తంగా Top 5 లిస్టులో, Joke Books ఎప్పుడూ ఉంటూనే ఉన్నాయట!

ఇంతటి గొప్ప Subjectను రచయిత ఎన్నుకున్నాడు గనకే వీరి రచనలు అటు అమెరికాలో, ఇటు ఇండియాలో 'హాటు కేకుల్లా' అమ్ముడవుతున్నాయట. అనతి కాలంలోనే, పునర్ముద్రణకు నోచుకుంటున్నా యట.

రచయిత సామాజిక రుగ్మతలను వేలెత్తి చూపుతూ, తనదైన హాస్యధోరణిలో వాటికి చికిత్స చేస్తారు. 'సెల్ఫీ పిచ్చి'లో మనకు 'సెల్ఫీ' వ్యసనం అన్నది జేబుఫోనులు, వాటిలో కెమెరా సౌకర్యం వల్ల ముదిరి పోతోన్నదని, కాసేపు తన బాల్యంలోకి వెళ్ళి, ఆనాటి ఫోటో స్టూడియోలు కలర్ (ప్రాసెసింగ్) ల్యాబులు, పెళ్లి ఫోటోలు, ఆ తరువాత వచ్చిన పోలరాయిడ్ కెమెరాలు Instant ఫోటోలుతో మొదలుపెట్టి నేటి 'సెల్ఫీ'లు అందునా మన భంగిమలు, ప్రముఖుల ప్రక్కన 'సెల్ఫీల' ప్రహసనం, సున్నితమైన హాస్యం 'కథ' అంతా కనిపిస్తుంది.

దేశాధినేతల పరస్పర సందర్శనలు, అవతలి దేశంలో వీరికి జరిగే 'మర్యాదలు', సదరు అధినేత ఇవతల దేశ సందర్శన, వారికి జరిపే Reciprocation మర్యాదలు 'అమెరి కోతికి కొబ్బరికాయ'లో చెప్పబడింది. 22 సెప్టెంబర్, 2019న అమెరికాలో జరిగిన 'హౌడీ మోడీ' కార్యక్రమం అక్కడి NRI ల 'జన సమీకరణ', స్టేజిపైన ట్రంపు మోడీగారల ఆవేశానందాలు, పరస్పర మరియు 'స్వగోకుడు', విన్యాసాలు తెగనవ్వు పుట్టిస్తాయి.

కార్పోరేటు కల్చర్ బాగా ఒంటపట్టించుకున్న అమెరికా ఆసుపత్రుల్లో రచయిత పదిరోజులు 'అమెరికాలక్షేపం' చేయాల్సివస్తే, ఎదురైన అనుభవ తతంగము, ప్రాణాంతకం కాని చీకాకు వ్యవహారం చదువుతూంటే, నవ్వాగదు. శక్తి సామర్థ్యాల మేరకు, మన కార్పోరేటు, (కాసుల) ఆసుపత్రులు కూడా అక్కడి ఆసుపత్రులను అనుకరిస్తున్నాయని తెలిసి విస్మయ పడతాము. American Health Care system works perfectly when you are in perfect health (పే.14) అని తెలిసి, వెర్రిపోకడలు, వ్యాపార ధోరణులు ప్రపంచవ్యాప్తం అని నిట్టూర్చుతాము.

భారతదేశం ఒక ఉపఖండం. ఎవరి భాష, యాస వారిది. తెలుగు వారు 'వసంతం' అంటే, బెంగాలీబాబులు 'బసంతం' అంటారు. తమిళ తంబిలు 'కఖగఘ'లకు ఒక్కటే అక్షరం 'క'. 2020లో జరిగిన గణతంత్రదినం సందర్భాన మన రెండు రాష్ట్రాల గవర్నర్‌లు అమ్మవొడి పథకాన్ని అమ్మబోడి, కంటి వెలుగు పథకం 'కంటె భెలుగు', రైతు భరోసా కాస్త 'రౌత్ భౌఱోషా' అయిందని, Every Paise కాస్తా యెవ్వెరి పైసా, పల్లె ప్రగతి 'పల్లె ప్రగదీ'గా మారి భారతదేశం సాధిస్తోన్న ప్రగదీ-అదే-ప్రగతికి రచయిత సంతోషపడతాడు.

పంతులు పిలక, సాయిబుగెడ్డం-రెంటి కులాలు, మతాలు వేరు రెంటినీ ఉద్ధరించటానికి, అదే- ఉత్తరించటానికి- కావల్సింది. ఒక కత్తి అని, దేశాధినేతల సౌహార్ద్ర పర్యటనల అంతరార్థం- 'అర్థమే' (వ్యాపామే)నన్న నగ్నసత్యాన్ని కుండబ్రద్దలు కొట్టి చెబుతారు రచయిత.

క్రొత్త క్రొత్త సరదా పదాలు సృష్టించటంలో రాజుగారు 'అందెవేసిన చేయి'. కడుపులో చల్ల కదలకపోవటం, 'వితవుట్ మూవింగ్ బటర్‌మిల్క్ ఇన్ దిస్టమక్' అయింది. బెటర్ హాఫ్‌కాస్త 'మంచి సగం (పే29) అయింది. ట్రంపు మోడీలు ఆవేశానందాలుతో పరస్పరం 'గోకారు'. బ్రాహ్మణ స్రష్ట కాస్త, బ్రాహ్మణ భ్రష్ట కావటం, కంఠలంగోటీ (ట్రై) మూతిగొచీ (మాస్కు) బెంగిలింగిలీశు (బెంగాల్ ఇంగ్లీషు) (పే37) లాంటి పద ప్రయోగాలు పాఠకుడి మోము మీద చిరునవ్వుపూలు పూయిస్తాయి.

నా మాటామంతీ...లో రచయిత ఈ కథల్లో కొన్నింటికి 'కాలదోషం' పట్టే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి (పే.v) అంటారు. కథల్లోని చరిత్రకు 'కాలదోషం' పడుతుందేమో కాని 'కథ'ల్లోని భాష యాస కాలదోషానికి లోనుకాదు. సరికదా- చదివిన ప్రతిసారీ- పాఠకుడి మనసు తేలిక పడటం ఖాయం! దీన్నే స్వర్గీయ గొల్లపూడి మారుతీరావుగారు 'మబ్బుపట్టిన మనస్సులకు ఆరోగ్యకరమైన, అందమైన విరుగుడు' అన్నారు

**ప్రతులకు:** వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా
నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్
విశాలాంధ్ర, నవచేతన,
మరియు అన్ని పుస్తక విక్రయాలలో.



- కూర చిదంబరం
సెల్: 8639335675

### వారెవా..!

ఈ దేశంలో
పదవుల్లేని మేధావులు
ప్రజాపక్షమంటారు...

పదవులెక్కగానే
పెదవులు
మూసుకుంటారు..!

ప్రపంచాన్ని
చదవాలనుకున్నా...
పుస్తకం దొరికింది
ప్రపంచం తెలిసింది..

వాడో
నిత్య అబద్ధాల పుట్ట
అయినా వాడికే
ఓట్లు.. సీట్లు.. నోట్లు..
ఇదేందిరా భై
అని అడిగినందుకు
నాకేమో
తిట్లు.. పాట్లు.. పోట్లు..

వాడికి
కన్నవారంటే ప్రేమ
కవిత్వం నిండా అదే..
వాడు మహల్లో..
వాళ్ళకు
గుండె నిండా బాధ
కళ్ళ నిండా వాడే
వాళ్ళు వృద్ధాశ్రమంలో..



- సంగెవేని రవీంద్ర
సెల్ : 99871 45310

### రాత - గీత

#### అల్ప సంతోషి

తెరచాపంత
తెలుగు దినపత్రికలో
ఆవగింజంత ఆకు
అక్షరాల నా పేరు
అబ్బో..! ఆహా..!! ఓహో..!!
ఆనందమే ఆనందం..



#### అంతం కానిది

స్త్రీ అనబడే సుగంధ పరిమళాల
అందమైన గంధపు చెక్కను
పురుష అహంకారి అనే పురుగు
తొలిచి.. తొలిచి..
పిప్పి చేస్తూనే ఉన్నాడు
అనాదిగా...



రాత-శిల్పా జగదీష్
సెల్: 9290827384
గీత-వర్చస్వి

బాల గేయం

### సెల్‌ఫోను

గణగణమోగే 'సెల్లు'!
పిల్లలకూ యీ రోజుల్లో
ప్రియంగ చేతులో 'సెల్లు'
విలువగు కాలం చెల్లు! ॥గణ॥

బుడతలు బువ్వలు తినడం లేదని
బుజ్జగింపుగా 'సెల్లు'ను యిచ్చి
'వీడియో'ల కలవాటును చేస్తే
పాడైపోయే ప్రమాదమాయే!
కళ్లజోళ్లను పసితనాననే
కంటికి పెట్టే రోగమ్మాయే! ॥గణ॥

'యూట్యూబు'ల్లో శృంగారాల
'సీను'లు కూడా చూసేస్తూ
ఇంట్లో - బడిలో కూడా అంతా
ఇదే విధంగా కొనసాగిస్తూ
అయ్యో! బాల్యంలోనే పిల్లలు
అత్యాచారాలకు లోనాయే!
॥గణ॥



- డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699



# సీమ చాసో- 'అనంత' రారా

**రాయల సీమ కరువును, రైతు గుండె బరువును సమర్థవంతంగా కథారూపంలోకి తెచ్చిన అద్భుత కథకుడు సింగమనేని నారాయణ**

రాయల సీమ కరువును, రైతు గుండె బరువును సమర్థవంతంగా కథారూపంలోకి తెచ్చిన అద్భుత కథకుడు సింగమనేని నారాయణ. మానవ సంబంధాలకు దర్పణంగా నిలిచే నవలలను సృజించిన నవలాకారుడాయన. నిష్కర్షగా నిజాన్ని విమర్శలో చూపించిన నిఖార్సైన విమర్శకుడు సింగమనేని. సమాజ పరివర్తనే లక్ష్యంగా మార్క్సిస్టు దృక్పథంతో సాహిత్య సృజన చేశారు. రచయితగా, కథకుడిగా, విమర్శకుడిగా, సామాజిక కార్యకర్తగా బహుముఖీన ప్రతిభ చూపిన సింగమనేని రాయలసీమ సాహితీవేత్తలకు పెద్దదిక్కుగా నిలిచారు. కథలు రాయడమే కాకుండా సీమలో కొన్ని తరాల రచయితలకు మార్గదర్శిగా వ్యవహరించారు.

అనంతపురం జిల్లా రాప్తాడు మండలం మరూరు బండమీదిపల్లిలో 1943 జూన్ 26న సంజీవమ్మ, రామప్ప దంపతులకు జన్మించారు సింగమనేని. తిరుపతిలోని ప్రాచ్య కళాశాలలో విద్వాన్ చదివారు. అనంతపురం జిల్లాలో తెలుగు భాషోపాధ్యాయుడిగా పనిచేశారు. ఆయన రాసిన కథలు పలు సంపుటాలుగా వెలువడ్డాయి. పదిహేడేళ్ల వయసులోనే 1960 లో 'న్యాయమెక్కడ' అనే కథను రాశారు. ఆ తర్వాత 'జూదం', 'ఊబి', 'విముక్తి', 'యక్షప్రశ్నలు', 'ఉచ్చు', 'అడుసు', 'మకర ముఖం', 'పరీక్షిత్తు', 'వసంత తుషారం' మొదలైన కథలను రచించారు. ఆయన రాసిన కథలతో 'జూదం' అనే పేరుతో కథాసంపుటం 1988 లో వెలువడింది. ఆ తర్వాత 1999 లో 'సింగమనేని నారాయణ కథలు' అనే పేరుతో, 2007 లో 'అనంతం' అనే పేరుతో, 2012 లో 'సింగమనేని కథలు' అనే పేరుతో కథాసంపుటాలుగా ప్రచురితమయ్యాయి. 'నీకు, నాకు మధ్య నిశీధి', 'జీవఫలం చేదునిజం' అనే మరో రెండు కథాసంపుటాలను కూడా ఆయన వెలువరించారు. ఆయన కథలు హిందీ, కన్నడ, మలయాళం భాషల్లోకి అనువాదమయ్యాయి. కథారచన చేయడంతో పాటు కథాసంకలనాలకు సంపాదక బాధ్యతలు నిర్వహించారు. 1992 లో ప్రచురితమైన 'సీమ కథలు' కథాసంకలనానికి సంపాదకుడిగా వ్యవహరించారు. ఈ సంకలనాన్ని 1994, 2010 సంవత్సరాలలో పునర్ముద్రించారు. 'ఇనుపగజ్జెలతల్లి', 'తెలుగు కథలు- కథన రీతులు', విశాలాంధ్ర ప్రచురణ సంస్థ రూపొందించిన 'తెలుగు కథ' మొదలైన గ్రంథాలకు ఆయన సంపాదకుడిగా ఉన్నారు. 'ఆదర్శాలు ? అనుబంధాలు', 'అనురాగానికి హద్దులు', 'ఎడారి గులాబీలు' అనే నవలలు రచించారు.

ఆయన వ్యక్తిగత జీవితంపై చిన్నప్పుడే పడిన సుప్రసిద్ధ కమ్యూనిస్టు నేత తరిమెల నాగిరెడ్డి ప్రభావం ఉంది. రచనాశైలి విషయంలో కొడవటిగంటి కుటుంబరావు, సైద్ధాంతిక ఆలోచనాధోరణిలో శ్రీశ్రీ ఆయన సాహిత్యంపై గాఢమైన ముద్ర వేశారు. సూటిగా అలంకారాల ముసుగులు లేకుండా వాస్తవాన్ని చెప్పడం నారాయణ రచనాశైలి. కృత్రిమత్వానికి చోటు లేకుండా ఆయన కథలు సహజమైన అంశాలతో అలరారుతాయి. వస్తువులోనే కాకుండా శిల్పంలో కూడా వాస్తవికతే ఉండాలన్న తన అభిప్రాయాన్ని తన కథలలో కూడా ఆయన పాటించారు. పాఠకుడి గుండెను నేరుగా చేరే పదునైన కథలు ఆయనవి. రాయలసీమ నేపథ్యంలో ఈ కథలు సాగుతాయి. అనంతపురం మాండలికం కథల్లోని సంభాషణల్లో అడుగడుగునా కనబడుతుంది. ఆయన ఎంతో అభిమానించే 'చాసో'కథల్లోని క్లుప్తత ఆయన కథల్లోనూ కనబడుతుంది. చాసో లాగే రచయిత ప్రవక్త స్థానంలో కూచోగూడదన్న అభిప్రాయం సింగమనేనిది. సామాజిక సమస్యలను రచయితలు ఆవిష్కరించి, పరిష్కారాలను పాఠకుడికి వదిలేయాలన్న దృఢమైన అభిప్రాయాన్ని ఆయన వ్యక్తపర్చారు. పరిష్కారం చెప్పే బాధ్యతను రచయితలు తీసుకోరాదని ఆయన పేర్కొన్నారు. అందుకే రచనాశైలితో పాటు అభిప్రాయాల విషయంలోనూ సింగమనేనిలో కొడవటిగంటి కుటుంబరావు, చాగంటి సోమయాజులు కనబడతారు. పీడితుల సమస్యలకు కథారూపం ఇవ్వడం, క్లుప్తత, మార్క్సిస్టు దృక్పథం, వాస్తవిక పరిస్థితులకు అద్దం పట్టడం వంటి కారణాల వల్ల సింగమనేనిని 'రాయలసీమ చాసో'గా పేర్కొనవచ్చు.

పురాణాలను, ప్రబంధ సాహిత్యాన్ని విస్తృతంగా అధ్యయనం చేసిన మార్క్సిస్టు సింగమనేని నారాయణ. ప్రాచీన సాహిత్యాన్ని లోతుగా పరిశీలించారు. బుచ్చిబాబు, కొడవటిగంటి, చలం, శ్రీశ్రీ సాహిత్యాన్ని మథించారు. రాయలసీమ ప్రజల కష్టాలు, కన్నీళ్లను పూర్తిగా అవగతం చేసుకున్నారు. ఆ అధ్యయనాన్ని, ఈ అనుభవాలను రంగరించి కథలుగా మలిచారు. అందుకే సీమ కడగండ్లను ఆ మాండలికంలోనే పాఠకుడి గుండెలను తగిలేలా చిత్రించగలిగారు. సీమ కరువు బాధలు, రైతు జీవితంలోని కన్నీళ్లు పాఠకుడిని కలవరపెడతాయి.

నిజాయితీగా, మార్క్సిస్టు దృక్పథంతో విమర్శలు చేస్తారన్న మంచి పేరు సాధించారు సింగమనేని. 'సంభాషణ' పేరుతో వ్యాస సంపుటిని ఆయన వెలువరించారు. 'కథావరణం', 'మున్నుడి', 'పరిమితం' అనే విమర్శనాగ్రంథాలను రచించారు. కేంద్ర సాహిత్య అకాడెమీ రూపొందిస్తున్న 'భారతీయ సాహిత్య నిర్మాతలు' అనే గ్రంథ పరంపరలో భాగంగా సుప్రసిద్ధ కథకుడు మధురాంతకం రాజారాంపై ఒక మోనోగ్రాఫ్ రాశారు. మహీధర రామమోహనరావు రాసిన 'కొల్లాయి గట్టితేనేమి', రంగనాయకమ్మ రచించిన 'జానకి విముక్తి' తదితర నవలలపై చక్కటి విమర్శ చేశారు. చాసో, రారా, మధురాంతకం రాజారాం మొదలైన సాహితీ ప్రముఖులపై ఆయన విమర్శనా వ్యాసాలు ఆలోచింపజేస్తాయి.

రాచమల్లు రామచంద్రారెడ్డిలా కటువైన విమర్శకుడన్న పేరును సింగమనేని పొందారు. సాహిత్యకారులకు కర్తవ్యాన్ని బోధించే విమర్శ ఆయనది. ఆయన సాహిత్య విమర్శలో నిక్కచ్చితనం, నిబద్ధత కనబడతాయి. రాచమల్లు రామచంద్రారెడ్డి లాగే సింగమనేని కూడా పాఠకుడి దృష్టికోణం నుండే రచనను పరిశీలిస్తారు. పాఠకుడిపై ఆ రచన కలిగించే ప్రభావాన్ని వివరిస్తారు. తాను రాసే విమర్శనా వ్యాసం ఎంత గొప్ప రచయితకు సంబంధించినది అయినా గ్రంథంలోని అంశాలపైనే ఆయన దృష్టి తప్ప రచయితపై కాదు. అందుకే గ్రంథంలోని అంశాలపై కూలంకష విశ్లేషణ ఆయన విమర్శలో కనబడుతుంది. రచయిత కాకుండా గ్రంథమే విమర్శలో కనబడడం వల్ల గుణదోష పరామర్శలో నిజాయితీ ఉంటుంది. గ్రంథంలోని అంశాలను వ్యతిరేకించాల్సి వస్తే ఏమాత్రం ఉపేక్షించకుండా దులిపేసే రా.రా. పద్ధతిలోనే సింగమనేని విమర్శ దర్శనమిస్తుంది. 'స్త్రీవాద కథలు పురుష పాఠకులను చాలా డిస్టర్బ్ చేశాయ'ని తన అభిప్రాయాన్ని నిస్సంకోచంగా వెల్లడించారు. మరో కథకుడు డా. వి. చంద్రశేఖర్ రావు 2002 లో రాసిన కథలపై తన విమర్శలో 'పిడికెడు విమర్శకుల మెప్పు కోసమే కథలు రాస్తూ అనంతమైన పాఠకులను చంద్రశేఖర రావు మర్చిపోయార'ని అభిప్రాయపడ్డారు.

ప్రతిష్ఠాత్మక అప్పాజోస్యుల-విష్ణుభొట్ల-కందాళం ఫౌండేషన్ జీవితకాల సాధన పురస్కారాన్ని 2013లో సింగమనేని నారాయణ పొందారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2017 లో 'కళారత్న' పురస్కారాన్ని ఆయనకు అందజేసింది. అభ్యుదయ రచయితల సంఘం గుంటూరు జిల్లా శాఖ నుండి 1997 లో అమరజీవి పులుపుల వెంకట శివయ్య సాహితీ సత్కారం పొందారు.

అధ్యయనం, విశ్లేషణ, భావ వ్యక్తీకరణల విషయంలో సింగమనేని విమర్శ ప్రత్యేకమైంది. ప్రగతిశీల ధోరణితో కూడిన విమర్శ ఆయన సొంతం. కథారచన, నవలా రచన, విమర్శలో ప్రత్యేకత చూపించిన సింగమనేని రచనలు భావి రచయితలకు మార్గదర్శనం చేస్తూనే ఉంటాయి.



-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు,
9441046839

## శ్రీ దేవునిపల్లి

విలువకు పీఠం వేసిన దేవులపల్లి
'నీ పదం' ఎన్నటికీ వాడని సిరిమల్లి.

నీ కలం చేసిందొక నిష్ఠపూరిత మహా సంకల్ప యజ్ఞం
భావితరాలకు ఇచ్చిందొక స్వచ్ఛమైన అమూల్య సాహితీ కల్ప వృక్షం.

నీ పదం.. అనిర్వచనీయ భావసంపుటి సహిత కావ్యం
నీ పాట.. నురుగుల పరుగుల సుందర తరంగ సహిత సంద్రం.

విలువకు పీఠం వేసిన దేవులపల్లి
'నీ పదం' ఎన్నటికీ వాడని సిరిమల్లి

వెన్నెల కాంతుల చల్లదనం, తారల తళుకుల ఆహ్లాదం
రాతలకందని భావసమ్మోహనం సంపూర్ణంగా నీ 'గీతానికే' సొంతం

నీ పద సాహితీ నదీ తీరంలో
తెరలు తెరలుగా మనసున చేరే కమ్మని భావం చెప్పలేనిది..

చిన్ని కృష్ణుని పిల్లనగ్రోవి శబ్ద తరంగాలను ఆస్వాదించే
గోవుల మధురానంద భావంతో అది సరిపాటి.

విలువకు పీఠం వేసిన దేవులపల్లి
'నీ పదం' ఎన్నటికీ వాడని సిరిమల్లి

శుభోదయ వేళ..
ధవళవర్ణపు పూరెమ్మలపై నిశ్చలంగా నిలచే
స్వచ్ఛమైన మంచు బిందువులా

నీలి సంద్రపుదాటి తెలతెల్లని మబ్బుల మాటున ఎగసే
బంగారు కాంతుల భానుకిరణంలా
ప్రకృతి సౌందర్యాన్ని సంతరించుకొన్న ఆణిముత్యాలు "నీ పాటలు".

మరువలేని భావ సమ్మేళనం "సడిసేయకే గాలి"
మరపురాని భక్తి తరంగం "నీ ఉండే ఆ కొండపై"
ఆబాల గోపాలాన్ని అలరించిన "ఇది మల్లెల వేళ అని"

ఇలా ఎన్నో ఎన్నెన్నో సాహితీ కుసుమాల్ని పంచి
"ఆకులో ఆకునై" అంటూ
సాహిత్యానికి ఒక కొలమానంగా మారావ

విలువకు పీఠం వేసిన దేవులపల్లి
'నీ పదం' ఎన్నటికీ వాడని సిరిమలి


తెల్లని సాహిత్యపు అస్తిత్వం కోసం సదా శ్రమిస్తూ
ఉన్నత సందేశం, సామాజిక విలువల్ని మేళవిస్తూ
రచించిన అపురూప గీత సంపుటి నీ సొంతం
నీవొక శక్తి వాహినివి.. నిరంతర కాంతి స్వరూపానివి
సదా నిలుస్తుంది నీ 'కీర్తి'.. అదే భావితరాలకు 'స్ఫూర్తి'
నీవు పంచిన ఔన్నత్యం నిండిన సాహితీ విలువల్ని
ఆసాంతం ఆస్వాదించే శక్తి నేటి తరానికీ,
నవతరానికీ కలగాలని కోరుతూ..

ఉద్వేగ భరిత హృదయంతో
అమూల్య సాహితీ సంపద పంచిన కవి సార్వభౌమునికి
కృతజ్ఞతలతో ఇదే మా వినమ్ర కవిత పదాంజలి.

విలువకు పీఠం వేసిన దేవులపల్లి
'నీ పదం' ఎన్నటికీ వాడని సిరిమల్లి.



- తాతాజీ వుసిరికల
97455636042



## వాగ్దేవి సుతుడు...

దేవుల పల్లె నించి వచ్చిన
దేవ దూతవో
దివి నించి భువికి దిగి వచ్చిన
భావగర్భిత భాషవో
వాగ్దేవి సుతుడవో
కవితాకన్యకకు చెలికాడివో.
భాషకు మావటి నీవు
అక్షరాలు ఆయుధాలు
భావాలే బానిసలు నీకు...2

హృదయాన్ని కలవరపరిచి
అల్లకల్లోలం చేసి
కవి భావనావేశ ఆవరణలో
కృష్ణపక్షులమై
గాలిని సడి సేయకు అని
మృదువుగా శాసించినా
ఏడ తానున్నాడో బావా
అని జాలిగా ప్రశ్నించినా...
ఆకులో ఆకుగా..
కొమ్మలో నును లేత రెమ్మనై
ఒక పదుచు..అడవిలో ఉండిపోయినా
మావి చివురు తిని కోయిల పాడినా
కొమ్మా లేకుండానే గోరింట పూసినా...
కుశలమా నీకు కుశలమేనా
అని..దంపతులు. విరహగీతి పాడుకున్నా
ప్రతి రాత్రిని వసంత రాత్రి చేయగల
మీ భావుకత...
పూవులేరి తేవే చెలి పోవలె కోవెలకు
నీవలె సుకుమారములు, సుందరములు
అంటూ అమృత వీణ మీటినా.
ఇక్షుసార్ణవం వంటి సాహిత్యం అని శ్రీశ్రీ చే
ప్రశంసింపబడిన భావ హృదయం వారిది...2

ప్రతి లావణ్యాన్ని కదిపి
ప్రతి హృదయాన్ని పలకరించి
కన్నీటి చెలమలను మధురానుభూతి,
విహ్వల బాధతో తిరిగే ప్రవాసులమై
గుండె చాటున
దాచిన ఒక తీయనైన పాట మీది
ఆయన తెలుగు పదం
అమ్మమ్మ చేతిలో నేతి నైవేద్యం.
వర్షం వచ్చేముందు వీచే చల్లనిగాలి తెమ్మెర.
జనని జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి..
అని భరతమాతను కీర్తించినా,
జయ జయ జయ
ప్రియ భారత జనయిత్రీ దివ్య ధాత్రి..
అంటూ దేశభక్తిని చాటినా.
కృష్ణశాస్త్రి కులం... కోయిల కులం
మతం... హృదయ మతం
మార్గం... స్వేచ్ఛామార్గం

అచ్చమైన హృదయవాది..
రాళ్ళున్న పెద్ద పెట్టెలకన్నా,
రత్నాలూ వజ్రాలూ ఉన్న
చిన్న మూటలు విలువైనవి.
భావకవిత్వానికి బాటలు తీర్చిన
దేవులపల్లి కృష్ణశాస్త్రి
ఊహా ప్రేయసిని తలచుకుంటూ, పొగిలిపోతూ
'దిగిరాను దిగిరాను దివినుండి భువికి'
అంటూ స్వేచ్ఛాగానం చేసినవాడు.
నాకు ఉగాదులు లేవు...ఉషస్సులు లేవు..
పారవేసుకున్న హృదయ ప్రేమ
శకలాలు ఏరుకుని
జిలుగు వెన్నెల్లో చిమ్మ చీకట్లలో
మీ కవితలే చుక్కానిగా సాగే అన్వేషకులం.
నినాదాలతోకాక.. రచనా సంవిధానాలతో
భావకవిత్వం గోడ కట్టిన కవితా మేస్త్రి
కృష్ణశాస్త్రి..
భావ కవిత్వ సార్వభౌముడు...2


దేవులపల్లి...
మీకు మీరే సాటి... మీకిదే నా అక్షర నివాళి
భాష బ్రతికినంత కాలం
మీరు వర్ధిల్లుతూనే ఉంటారు.



-కల్యాణి కొండూరు
974 66159144

## వసపోసిన పిట్ట

దేహం గురించి కాదు
ఆత్మపడే వేదన గురించి
రెక్కల్ని విరిచి కట్టేసిన బాధ గురించి
నా ఆకాశానికి సరిహద్దులు గీసి
నీ చూపులకు సంకెళ్ళు బిగించి
నా నీడ నుండి
నన్ను దూరం చేసిన హింస గురించి
తీసివేసి యిన్నేళ్ళు గడిచినా
ఇంకా కాళ్ళ బంధాల ఆనవాళ్ళు పోలేదు
నేను నడవాలనుకున్న బాట నిండా
ఎంత ఏరిపారేసినా అక్కడక్కడా ముళ్ళు
అడుగెత్తినపుడల్లా అడ్డు పడుతూనే వుంటాయి.
అమ్మ నాన్న అన్నాతమ్ముళ్ళ జాబితాలో
ఇప్పుడు భర్త కూడా చేరిపోయాడు
రేపు వచ్చే కొడుకు మాత్రం నాకు
గొడుగుపడ్తాడన్న గ్యారంటీ లేదు
ఇప్పుడు నా ప్రతి అడుగుపైనా
డేగల్లా వెంటాడే చూపులనిఘా
నా ప్రతి కదలికని సొమ్ము చేసుకోవాలని
కోరలు సానబడుతున్న మృగాళ్ళు
చారిత్రకంగానే కాదు సాంఘికంగా సైతం
నేనొక వ్యాపార వస్తువు, సుఖాలగని
చివరికి రాజకీయ అరాచకంలో నేనొక పాచిక
అంతర్జాతీయ మహిళా దినోత్సవం వస్తుందంటే
మీడియాకి వారపత్రికలకి నేనొకటాపిక్
నన్ను గురించి వసపోసిన పిట్టాలా వాగనిదే
ఎవరికీ పూడగడవదు, పొట్ట నిండదు
తవ్వి తవ్వి అరిగిపోయిన అదే రికార్డు
మళ్ళీ మళ్ళీ వేయనిదే వాళ్ళకి తెల్లారదు
ఇంకా ఎన్నాళ్ళో, ఎన్నేళ్ళో తెలియదు గాని
నా జీవితం మాత్రం ఆకాశంలా
అటు స్వర్గానికి, ఇటు నేలకీ మధ్య
ఊగిసలాడే వురితాడు.



-గుర్రాల రమణయ్య
సెల్: 9963921943

## గుండె కొలనులో కొలువైన దేవతలు

కాకలు దీరిన కాకతీయులతో
సమరం సాగించిన వీరవనితలు
కప్పానికి వ్యతిరేకంగా ఎగిసిపడిన నిప్పు కణికలు
ఆదివాసుల ఆది దేవతలుగా
సకల జనులకు సమ్మక్క సారలమ్మ లుగా
తరువుల మధ్య తల్లులు వెలియడంతో
పుడమి తల్లి పులకరిస్తోంది
ప్రకృతి మురిపెంగా మురిసిపోతుంది.

గజిబిజి జీవితాలకు సెలవు పెట్టి
కష్టాల కావడిని గట్టున పెట్టి
భక్తి సాగరాన్ని మనసు లో ఒంపుకొని
కాసులకు కట్టిన ముడులన్నీ విప్పుకొని
మూట ముళ్ళె ను నెత్తి నెట్టుకొని
సంకలో సంటి పిల్లను ఎత్తు కొని
కాళ్ళకు చక్రాలు కట్టుకొని
చీమల దారల్లా కదులుతుండ్రు
వనారణ్యంలో జనారణ్యం
సంబరాల సందళ్ళు చేస్తుండ్రు.

జంపన్న వాగులో జలకాల కోలాహలం
శివసత్తుల నృత్యాలు
కోయదొరల కాలజ్ఞానాలు
నిలువెత్తు బంగారంతో తులాభారాలు
జాతరంతా జనాల సందడి
మమతల మురిపాల అంగడి.

తల్లులూ !
సబ్బండ వర్గాలను చల్లంగా చూడాలి
కరోనామహమ్మారి జగతిని విడిచి పోవాలి
బడుగుల బతుకు చిత్రం మారాలి మీ
చల్లని చూపులు ఎల్లప్పుడూ మా పై ఉండాలి
సంతోషాల సిరులు పండాలి.
జనమంతా హాయిగా ఉండాలి
( సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా)



-తాటిపాముల రమేష్
7981566031

## నేను ఒంటరిని

ఒంటరిని నేను
వేల గొంతుకల రణగొణ ధ్వనుల హోరులో
నిశ్శబ్దాన్ని శోధించే
బధిరుడను నేను.
అనంత జలధితరంగాన
గొంతుక తడుపుకోలేని
దాహార్తిని నేను.
కోటికాంతుల దీపాలనడుమ
దారి తప్పిన చీకటిని నేను.
ప్రభాత కిరణాలు పరచిన బాటన
నడవలేని
అంధుడను నేను.
గుప్పెడు జ్యోత్స్నా శకలాలు
ఆకాశమంతా పరచి
వెలుగే దొరకని అమవసనే నేను
అమాయకులు సంధించే ప్రశ్నలకు
సమాధానమెరుగని ప్రహేళికను నేను.
జనారణ్యంలో ఎలుగెత్తి అరచి,అరచి
ఓడిపోయిన మానవతనే నేను.
నిజాన్ని నేను
మరుగునపడిన మానవ నైజాన్ని నేను



- లలితావర్మ
9949672671

## నిరీక్షణ

ఎంత కాలం నిరీక్షణ
చుక్కలు నేలరాలుతాయని
దారి మారిస్తాయని
మిలమిల మెరుస్తున్న చీకట్లో
చీకటిని ఓడిస్తున్నాయి
జనం చీకట్లో వున్నారు
చుక్కలను ఆయుధాలుగా మల్చుకోవటానికి
ఎంత కాలం నిరీక్షణ.



-సి.హెచ్. మధు
9949486122

## జైహో దేవులపల్లి

పిఠాపురంలో ఉద్భవించిన సాహిత్య గని
పండిత పుత్రుడైనా
సామెతకు సరికాని శమంతకమణి
ఎనిమిది బారువుల బంగారం లాంటి
సాహిత్య సంపదను
తెలుగు జగతికి ఆపాదించి పెట్టిన సాహసి
కవితాలోకాన కల్పవల్లి.. మన దేవులపల్లి.
మన ఆంధ్రాషెల్లీ వర్ధంతి ఈ రోజు
సాహితీ మాగాణంలో
అక్షరాలతో సరిగమలు పదాలతో అర్థాలు
పద్యాలతో భావాలు కవితలతో అనుభవాలు
వ్యాసాలతో దిశానిర్దేశాలు
కల"హలంతో" ఎన్నో పంటలు పండించిన
ఈ కవి కృషీవలుడు అస్తమించిన రోజు.
దేవులపల్లి గారి గూర్చి తలంపే
ఒక మధురమైన మరుపురాని రోజు
సాహితీ ప్రియులకు విన్నాకొద్ది
వీనులవిందు చేస్తుంది
విశాదకవితలైనా ప్రణయ గీతాలైనా
భక్తి పాటలైనా
తెలుగు పాఠకులను సమ్మోహితుల్ని చేస్తుంది.
ప్రకృతి ఆరాధకుడిగా కృష్ణపక్షమునకు బీజం
సతీమణి వియోగంతో రచనల్లో విశాదం
ఊహా ప్రేయసి, ఆత్మాశ్రయత్వం లాంటి రచనలకు మూలం
రవీంద్రుని పరిచయంతో మలుపుతిరిగింది కృష్ణశాస్త్రి జీవితం
పునర్వివాహంతో ఉత్సాహం చలనచిత్ర రంగప్రవేశం
"ప్రతి రాత్రి వసంత రాత్రి" అంటూ ప్రేమగీతాలైనా ,
"జయ జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్య ధాత్రి"లాంటి
గుండెల్లో ఉప్పొంగే దేశభక్తి గీతాలు
కృష్ణశాస్త్రి కలం కురిపించిన ఆణిముత్యాలు.
అనారోగ్యంతో మూగబోయిన గళం
ఐనా అలుపెరుగని కలం
సాగింది సాహిత్యప్రవాహం
పరుగులు తీసింది వచన కవిత్వం
పండింది వ్యవహారిక భాషావాదం.
ఆంధ్రవిద్యాలయం ద్వారా "కళాప్రపూర్ణ" సత్కారం
భారత ప్రభుత్వం తో "పద్మభూషణ్" గౌరవప్రధానం
"ప్రఖ్యాత సాహిత్య అకాడమీ పురస్కారం"
ఎన్నో ఎన్నెన్నో సన్మానాలు , అవార్డులు
దేవులపల్లిగారి అమ్ములపొదలోని అస్త్రాలు .
అందుకే
ఆ సాహితీ వ్యాసంగుడు పదలాలిత్యుడు
భావకవితా భాస్కరుడు
అక్షరయజ్ఞం తో మాతృభాషకు వన్నెతెచ్చిన
హృదయవాది మహాకవి ధన్య చరితులు
సదాస్మరణీయులు..



- రామడుగు వేణుగోపాల్,
దోహా, ఖతార్ (మంథని)

## నానోలు

పలక
పొలం
బలపం
హలం

చీకటి
అజ్ఞానం
వెలుగు
జ్ఞానం

కోపం
పాపం
శాంతం
రక్ష

ఆశ
సహజం
దురాశ
అసహజం

మంచి
స్వర్గం
చెడు
నరకం



- ఎం.ఏ. గఫార్
9490324834

## నానీలు

కష్టం సుఖం
ఒకదాని వెంట
ఒకటి
పగలు రేయిలా

నెలవంక
పరుగులు
కుందేలు పిల్ల
కంటే వేగంగా!

అమృతం
రుచి చూడలేదా?
నేను చూసా
అమ్మ తీపి ప్రేమలో !

నాన్నంటే
ఎవరో తెలుసా?
కంట్లో కన్నీరు
రాకుండా చూసేవాడు



-యలమర్తి అనూరాధ
9247260206

## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
**పోటీ ఫలితాలు**



అడ్మిన్: రమాదేవి కులకర్ణి


### 'బుధవారం బాద్షా'

నిర్వహణ: డా|| ప్రతికంఠం మాలతీలత
ఈ సమూహంలో చేరదలచినవారు

ప్రథమ బహుమతి విజేత

### శీర్షిక: భువిన నిలిచిన చరిత

బంగారులేడి అనుకున్నమాయలేడి
జానకమ్మ తలరాతను తలకిందులు చేసి,తల్లడిల్లేలా చేసింది.
విభునిరాక కొరకు
'కనులు' కాయగాసేలా వేచిచూసింది సీత కానలందు.
శోకసంద్రమందుకన్నీరంతయు యింకెను
'ఎండ' తాకిడిని తట్టుకోలేని 'తామరలు' వడలినట్టుగా సీతమోము చింతతోని వడలి పోయింది .
'ఆకాశం'లోని నక్షత్రాల్లా కాంతివంతంగా కళకళలాడుతూ వెలిగే సుందరమైన ప్రసన్న వదనం
కాంతిహీనంగా ,కళావిహీనంగా మారిపోయింది.
తనపై కోదండరామయ్య చూపిన 'అరువు'తెచ్చుకోలేని ప్రేమ ఆప్యాయతలు మనఃఫలకముపై పదిలంగా నిలుపుకుంది సీత.తన కొరకు దశరథనందనుడు వస్తాడన్న ప్రగాఢవిశ్వాసం, కడవరకూ తనతోనే వుంటాడనుకొని తను రఘువంశ తిలకుడిపై కోటిఆశలు పెట్టుకుంది.......
తండ్రి ఆజ్ఞను తనయుడు,భర్త మాటను
భార్యగౌరవించి,బాధననుభవించినా.....పెద్దలపట?ల వారు చూపినగౌరవం ,
ప్రజలపట?ల చూపిన ప్రేమాభిమానాలే...నేటికీ వారు ప్రజల మన్ననలందుకునేలా చేశాయి.
మహిమాన్విత చరితులుగా ప్రజలహృదయాల్లో
భువిన నిలిచిపోయారు.మన సీతారములు.




-అన్నాడి జ్యోతి

ద్వితీయ బహుమతి విజేత

### శీర్షిక: స్వర రాగ ఝరి

నీ స్వర రాగ ఝరిలో..
ఓలలాడిన తనూ..మనస్సులను చేతబట్టి..
నీ మది క్షేత్రాన..
మమతల పూలు పూయించాలని నినుచేరా..
నీ కనులు.. కలల భాష్యాలై
నా మదికి శరాలను దూస్తూంటే..
అలజడుల మది గోడలలో
తరంగాలై తచ్చాడగా..
తామర పూలై విరిసే నీ నవ్వులకు..
మది పరవశాల గంగై
ఉప్పొంగుతోంది..
నీ ఊసులు నింపుకున్న నా మది..
ఆకాశాన..
మేఘాల్లో...తేలిపోతూంటే..
నీ..మదిగదిలో నేనెలా ఒదగ గలను..
జాజి పువ్వంటి పరిమళాన్ని ఆపాదించుకున్న..నీకు..
ఈ గుల్ మహర్ పూలను నేనెలా అందివ్వగలను..
ఎండల్లో.. వానల్లో ధీటుగా
మేరు పర్వతమై నిలవటమే కాదు
అరకు లోయల్లో కూడా
నీ అడుగు జాడలు నను పిలుస్తున్నాయని..
కోయిలలనడిగి
అరువు తెచ్చుకున్న వేయి గొంతుకలుగా..
కూహూ కూహూ.. రాగాలుగా
నను పిలుస్తున్నాయని..
నామది అంతరాలలో సడిచేసే తరంగాల్లా..
చెలిమి చేయందుకున్న..
నిన్ను..
నా మదిగదిలో బంధిద్దామంటే..
అంబరమంత ఎదిగిన నిన్ను..
అణువంత మదిలో
ఎలా బంధించగలను.. ?.



-పోపూరి మాధవీలత

## కవి సైనికులమై..

అమ్మ రూపాలైన అక్షరాలు
అమ్ముల పొదిలో అస్త్రాలైతేనే..
సమాజానికి పట్టిన మాయదారి
మహిషాసురులను తుదముట్టించే
అక్షర గాండీవపు..
మారణాయుధాలవుతాయి..
మానవ కల్యాణానికి తోడ్పడతాయి..!!
కనులకు కనిపిస్తున్న కుతంత్రాల
పద్మ వ్యూహపు పన్నాగాలకు
పలాయనం చిత్తగించక..
మది సంద్రంలో దావానలంలా లేసే
భావతరంగాలకు.. ఆలోచనల
ఆర్ద్రతలతో ఆజ్యం పోస్తూ..
అభిమన్యులమై అక్షర శరాలను
సంధించాలి...సత్యం కొరకు పోరాడాలి..!!
అన్యాయాన్ని ఎదిరించే
కవి సైనికులమై..
అనవరతం అక్షర గాండీవాలను
ఎక్కుపెడితేనే కదా..
సామాజిక శోషణలను..
శబ్దాస్త్రాలతో ఛేదించ గలం..
మనవంతు కర్తవ్యం నిర్వర్తించ గలం..
మానవత్వమున్న..మనుషులమని
అనిపించుకోగలం...!!!!



-సావిత్రి రంజోల్కర్
9833497812

## నానీలు

గాజులను
తొడిగే చేతులకే
ఖాళీలుగా మిగిల్చే
బతుకు ప్రయాణం.

గంపలో
మోసుకోస్తున్నవి
జీవితమున కడుపు
నింపే మెతుకులు

ఎందరినీ
మ్రొక్కిందో!
రెక్కలొచ్చి పేగు
ఎగిరిపోయింది.

రంగు రంగుల
గాజులమ్మా
ముత్తైదువుల మనసున
నవ్వు తెచ్చింది.

అతివల
మనసును దోచి
ఐదవతనానికీ
వన్నె తెచ్చింది

ఘల్లు ఘల్లుమని
జిగేల్ మనును
స్త్రీ సౌభాగ్యం
పచ్చగా నిండేను



-పగిడిపల్లి సురేందర్ పూసల
8074846063


## మనిషి జన్మ

పుట్టుకలో వేదన
గిట్టుట లో వేదన
పుడుతూ ఏడుస్తాడు
పోతూ ఏడిపిస్తాడు.

పుట్టుట గిట్టుట
మధ్య జీవితంలో
ఎన్నెన్నో వేదనలు
కలిగిస్తారు కొందరు
కొన్ని ఆనందాలు
కలిగిస్తారు కొందరు.

మనిషి జన్మకు సార్థక్యం
మానవత్వం చాటుకోవడం
మనిషి జన్మకు గౌరవం తేవడం
మళ్లీ పుట్టాలి అనిపించుకోవడం..
ఆ మనిషే ఈ భువిపై
శాశ్వతంగా నిలిచిపోతాడు
కాయం కాటిలో కరిగిపోయినా
అతని కీర్తి నిలిచివుంటుంది
అది స్ఫూర్తి నిస్తువుంటుంది.

మనిషిగా మళ్లీ నూతన జీవితం
ఆ కీర్తి తో మళ్లీ ఆరంభం
అతడే మనిషి జన్మకు కీర్తి
అతడే మనిషిగా యశస్వి
అతడే మరణం లేని మనషి




-బూర దేవానందం
9494996143

## జీవితం

విశ్వాసం
వినయం
విజయం
వికాసం.


నమ్మకం
ఆచరణ
అద్భుత
ప్రగతి



- యెల్డి సుదర్శన్ పద్మశాలి
సెల్: 9892411067

# గీతాంజలి అనుసృజన - శ్రీ రాంచెందర్‌జీ విరచితము

## సమీక్ష - పరిచయము




విశ్వంలోని సమస్త జీవ రాశి సౌరభాన్ని ప్రకృతిలోని దివ్యత్వాన్ని ఆఘ్రాణించి – ఆనందతరంగాల ఉయ్యాలలో దేవ దేవుని పాదాలచెంత ప్రేమాబ్ధి – తన అనిర్వచనీయ అనుభూతుల భావ సంపదను సమర్పించుకున్నవాడు – విశ్వ కవి రవీంద్రనాథ్ ఠాగూర్. [illegible]

We must go deeper down. We must discover the most profound unity, the spiritual unity between the different races. We must go deeper down to the spirit of man and find out the great bond of unity, which is to be found in all human races. India being the epic centre and supreme commander of the spirituality should take the lead in this dissection.

The so proclaimed universalism by all world religions is summarized in one sentence in Adharvana veda i.e. All human beings are of one race -

[illegible]

– Where the mind is without fear- అనే కవితలోని [illegible]

ప్రాపంచిక లాలసతలు–వీటన్నింటిలోని దౌర్బల్యాలు నాకు అర్థమయ్యేలా చేయమని భక్తుడు వేడుకుంటున్నాడు. [illegible]

6.రవీంద్ర గీతాల్లో [illegible] రాంచందర్‌జీ [illegible] ఈ క్రింది కవితా ఖండికలో గమనించండి.

– మృత్యువు – నీ యింటి తలుపు తట్టినపుడు అతనికి నీవు ఏమి సమర్పిస్తావు?

ఓహ్ ! అప్పుడు నా అతిథి (మృత్యువు) ముందు నానిండు జీవన కలశాన్ని ఉంచుతాను ! [illegible]

[illegible]

అర్థం చేసుకోవాలి. మీరు ప్రసాదించిన జీవితాన్ని పరిపూర్ణంగా ఫలప్రదం చేసి మళ్లీ నీకే సమర్పిస్తున్నాననే భావన కవి ప్రకటిస్తున్నాడు. రాంచందర్‌జీ గారు కవిత్వంలో అత్యంత ఆహ్లాదకరమైన భాషా నైపుణ్యంలో ప్రకటించిన కొన్ని కవితా పాదాల్ని – మీ ముందు ఉంచుతున్నాను

1. అవ్యక్త భావనా పద పరంపరల నా చిన్నారి దోసిళ్ల నిండుగా నీ అంతు లేని కానుకల నింపుతావు.

2. నీ సంగీత కాంతిలో ప్రకాశించే ప్రపంచం నీ సంగీత జీవన శ్వాస అంబరమంతా ప్రసారం. నీ పావన గాన స్రవంతి నిరంతర ప్రవాహం – పాషాణ మార్గాలలో ముందుకు సాగును అహరహం.

3. మరి నా హృదయం మాత్రం ఉద్వేగపు గాలిలో ఊగిసలాడుతుంది !

4. విరహోద్వేగమున వేగిర పడు వాసంత పరిమళ నిశ్వాసమట్లు తోచనిది (రాంచందర్‌జీ ఆంగ్ల భాషా ప్రావీణ్యం – అనువాద శైలి – పరస్పరం పూర్తిగా సహకరించుకున్నవి.

5. కొడి గట్టుతూ..... రెపరెపలాడుతున్న – నా అంతరాత్మ దీపాన్నీ – నీ అర్చన కోసం సిద్ధపరుస్తాను.

6. కాంతి ....... ఎక్కడుంది కాంతి? మండుతున్న కాంక్షాగ్నితో వెలిగించుదానిని !– అద్భుతంగా వుంది కదూ !

7. హృదయం గట్టిపడి ఎండి పోయినపుడు నాపై కరుణారస దృష్టి కురిపిస్తూ........ రా !!

8. ఆషాఢ మేఘాలు కమ్ముకొన్న వర్షపు రాత్రుల్లో ఉరిమే మేఘాల రథం పైన ఆయన వస్తాడు ! వస్తాడు !!

9. మసక చీకటి నీడల్లో కోల్పోయిన నా ఆత్మ విశ్వాసం జాగృతమైంది

10. మృత్యువు చివరి దెబ్బ కొట్టినప్పుడు – జీవితం ఆఖరి స్పందనగా బాధతో కంపించినట్లు అది తీక్షణమైన కాంతిలో వెలిగే స్వచ్ఛమైన జ్వాలలా ప్రకాశిస్తున్నది.

11. ఎవరైనా నిన్ను తెలుసుకొన్నప్పుడు (అనగా దేవదేవుణ్ణి) ఎవ్వరు ఒంటరి కానే కాజాలరు.

12. యుగయుగాల జీవితలయకు ఈ క్షణము –

[illegible]

– ఎచ్చోట నిర్మల పాతఃపాద జ్ఞాన స్రవంతి మూఢాచారాల ఎడారి దారుల్లో యింకకుండా పారునో

– ఎచ్చోట విశాల భావనతో క్రియా ముఖమున నీ చేత ముందుకు నడిపించబడునో అటువంటి స్వేచ్ఛా స్వర్గధామమందు, నా పుణ్య భారత జాతిని జాగృతము గావింపుము తండ్రి.

– దేశ కాల మాన పరిస్థితుల్ని క్షుణ్ణంగా అధ్యయనంచేసి అవగాహన చేసుకున్న దుర్భర పరిస్థితులకు చలించి రవీంద్రుడి ఊహాలోకంలో ప్రభవించిన 'స్వేచ్ఛా స్వర్గం – తన దేశం కావాలని –స్వేచ్ఛ విశాలత్వము సత్యము, పరిపూర్ణత, హేతుబద్ధత, శ్రమ జీవనం ఆదర్శాలుగా పరిఢవిల్లాలని రవీంద్రుడి ఆకాంక్ష.

5. లౌకిక ప్రపంచమే సమస్త మనుకొనే ఎందరికో ఒక కనువిప్పు కలిగించే అపురూప కవితా రూపం

– రాంచెందర్‌జీ ఊహల్లో శోభాయమానంగా వెలిగింది. ఈజగతి జన సమూహాల నడుమ జరిగే వ్యాపారాలతో రోజులు గడిచిన కొలది రోజు వారి లాభాలతో నా చేతులు నిండినపుడు నేను పొందినది శూన్యమనే భావన కలుగనీ ! ఒక్క క్షణమైనా నిన్ను మరువనీయకు ! కలలోనైనా మెలుకువనైనా. ఈ కంటకమయ వేదన నన్ను భరించనీ !

– లౌకిక అలౌకిక ప్రపంచానికి మధ్యనున్న అఖాతాన్ని, లౌకిక ప్రపంచములోని సౌఖ్యం, విలాసాల విన్యాసాలు [illegible]

## ఠాగూర్ కవిత్వం - ఎందుకోసం ?

ప్రపంచమంతా కదురమణీయం, ప్రేమామృతం వర్షించే ఆనంద సాగరం. అందుకొని అనుభూతి చెంది పరవశించడం మనుషుల లక్షణం కావాలి. కాలుష్యంతో నిండిన ఈ జగత్తును, కల్మషాన్ని హరించే ఒక దివ్యౌషధంగా ఠాగూర్ కవిత్వం మేల్కొలుపుతుంది. మనం అందుకొని, అనుభవించే సహృదయత – సాధించడం ఎలా ? మనమంతా ఆలోచించాలి !




-కె. లక్ష్మణ గౌడ్
విశ్రాంత ఆచార్యులు
సెల్ : 9704930509

## బాల వికాసం

# ఏ బిడ్డైన ఒక్కటే!








చిన్న జొన్నగిరి ని ఆనుకోని ఒక ఆపిల్ తోట ఉండేది. అందులో ఒక చెట్టుకు చూడ చక్కని ఆపిల్ పండు ఉంది. పండును నివసించడానికి ఇంటిలాగా మార్చుకొని ఒక ముసలి పురుగు నివసించేది.

ఆ ఆపిల్ ఇల్లు ఎలా ఉందంటే, వంటచేసుకొనే గది, పడక గది, స్నాపు గది, బయటకు వచ్చి కబుర్లు చెప్పడానికి బాల్కని, రాత్రి కాగానే వెలుతురు ఉండటానికి దీపాలు, ఇలా, అన్ని వసతులున్న, విలాసవంతమైన, గృహం అది.

ఆపిల్ తోట మధ్యలో నలుగురు నడిచే దారిలో ఉంటుంది పురుగు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఎంతగా ఎదురు చూసినా, ఒక మనిషి, అపిల్ పండ్లు కోసే వారుకానీ, కోనేవారుకానీ, రాలేదు. కారణమేమో తెలియదు. అర్థం కాలేదు పురుగుకు.

అంతలో ఆపిల్ చెట్టు ఏడుస్తున్నట్లు ఏడుపు విన్పించింది. అక్కడ తొండ, ఉడత, చిలుక విచారంగా ఉన్నాయి.

ఎందుకో తెలుసుకోవాలి అన్పించింది. కర్ర తీసుకొని, నెమ్మదిగా ప్రాకు కొంటూ అక్కడికి చేరుకుంది. చెట్టమ్మ అలా ఏడవడం ఎప్పుడూ చూడలేదు.

"ఎందుకమ్మా అలా ఏడుస్తున్నావు?" అంది పురుగు ఆయాసపడుతూ.

"ఏమీ లేదే! అదేదో కరోనా రోగం వచ్చి, మనుషులు పిట్టల్లా రాలి పోతున్నారంటా!".. పాపం! మనుషులకు ఎంత కష్టం వచ్చింది." అంది అమ్మ చెట్టు.

అది విని ముసలి పురుగు చాలా ఆనందపడింది. అయితే మనం పండుగ చేసుకోవాలి" అంది ముసలి పురుగు. తొండ, చిలుక, ఉడుత, పురుగు వైపు ఆశ్చర్యంగా చూశాయి.

"ఇలాంటి మంచి విషయం, నీకు ఎవరు చెప్పారు అమ్మా!?" అడిగింది పురుగు.

"ఇంకేవ్వరే! మన చిలుకమ్మే, తను ఊర్లోకి వెళ్లిందట. ఊరంతా కరోనా గురించే మాట్లాడుకొంటున్నారంట... ఎవ్వరూ ఒక్కరు కూడా ఇల్లు వదలి మరో ఇంటికి వెళ్ళడం లేదంటా... తలుపులు మూసుకొని నెల రోజులుగా బ్రతికేస్తున్నారంటా"... అంది చెట్టమ్మ.

"ఇంకేముందే అమ్మా! మనకు మంచిరోజులు వచ్చాయంటా! లేకపోతె పక్షుల్ని జంతువుల్ని, చెట్లని, కొండల్ని, కోనల్ని, నదుల్ని, సమస్తాన్ని బాధ పెట్టారు. ఆ పాపం ఊరక పోతుందా! " చేసుకున్నోడికి చేసుకున్నంత. దేవుడు సరైన శిక్ష వేశాడు."... తొర్రి పండ్లు కన్పించేలాగా నవ్వ సాగింది పురుగు.

"అమ్మా! మనిషి తుమ్మినా, దగ్గినా, మరో మనిషి కి వస్తుందటా.. అది అంటు వ్యాధంటా...సృష్టి అంతా, విలవిలలాడి పోతుందంటా" అంది చిలుక.

"మనిషి చచ్చిపోతే, మనకే మేలు కదా! నీవెందుకు బాధ పడుతున్నావు? చూస్తూనే ఉన్నావు కదా! నీ పూవులకు గానీ, ఆకులకుగానీ, కాయలకు గానీ, పండ్లకు గానీ, మా జాతినో, మరో జాతినో, తినడానికి పోతే, విష మందులు కొట్టి దయ,దాక్షిణ్యం లేకుండా చంపేస్తున్నారు. ఈ మనుషులంతా ఒక్కడు, ఒక్కడు కూడా బ్రతక కూడదు. ఆ వ్యాధి నాకు కన్పిస్తే నేను ఇదే చెప్తాను. బాగా చంపమని సలహా ఇస్తాను." అంది ముసలి పురుగు.

"భలే! భలే! చెప్పావు ముసలి పురుగు!" అని చప్పట్లు కొడుతూ అక్కడికి వచ్చాడు వాల్మీకి.

"ఎవ్వరు లేకపోయినా, నీవు మాత్రం, తగుదునమ్మా! అంటూ పానకంలోని పుడకలాగా వస్తావు... చెప్పు! ఏదో ఒకటి చెప్తావు కదా! చెప్పు! " అంది ముసలి పురుగు కొమ్మను గట్టిగా పట్టుకుంటూ.

"నేనొస్తే నీకెందుకే అంత బాధ? అమ్మను ఓదార్చడానికి వచ్చాను. అవును ముసలీ! ఇందాక ఏమన్నావు? ఆకులు, పూలు, కాయలు, పండ్లు, నీవు తినడానికి వెళ్ళితే నిన్ను చంపేస్తున్నారు, అన్నావు కదా! మరి నీవు ఆకు లు, పూలు, కాయలు పండ్లు, తింటే అమ్మకు బాధ కాదా? నష్టం కాదా?" అన్నాడు వాల్మీకి.

"నేను అమ్మ దగ్గరే ఉంటాను, అమ్మను ఆశించుకొని ఉంటాను. చెట్టమ్మ లేకపోతె నేను బ్రతకలేను. అందుకే నాకు అమ్మ పైన హక్కు ఉంది." అంది ధీమాగా ముసలి పురుగు.

"చెట్టమ్మకు పక్షి, పురుగు, జంతువూ, క్రిమి, చిన్నదైనా, పెద్దదైనా, అమ్మ తన బిడ్డ అనుకుంటుంది." అన్నాడు వాల్మికి అమ్మ మొఖం చూస్తూ.

"అవునురా! మనిషి తప్పు చేసినా ఒప్పు చేసినా నా బిడ్డలలో తానూ కూడా ఒక్కడు. బిడ్డ ఎన్ని తప్పులు చేసినా, అమ్మ చిన్న చిన్న శిక్షలు వేసినా అవి మందలించి మంచి దారిలో పెట్టడానికే కాని పూర్తిగా ఎప్పుడు చంపదు."

"అమ్మా! చంపకపోతే వీళ్ళతో మనం బ్రతకలేమే అమ్మా!" అంది పురుగు.

"నీకు ఏండ్లు వచ్చాయి కాని బుద్ధి పెరగలేదు. వాల్మీకి అన్నట్లు ఈ సృష్టిలో ఎవరైనా, మంచోడైనా, చెడ్డోడైనా, ప్రకృతికి బిడ్డనే. అయితే, తప్పు చేస్తే, గాలితోనో, ధూళితోనో, ఎండా,వానలతోనో, క్రిమితోనో శిక్ష వేస్తుంది. తప్పులు సరిదిద్దుకోనేలా చేస్తుంది. అంతేకాని ఏ జాతి వినాశనాన్ని కోరుకోదు" అంది. చెట్టమ్మ.

"నిజమే కదా! ఎన్ని సార్లు చెట్టుకు నష్టం కల్గించినా నన్ను బిడ్డలాగే చూసుకొంది. ఆమే దయచూపకపోతే నేను ఎప్పుడో చచ్చే దాన్నే" అని మనసులో అనుకొంది పురుగు. వాల్మీకి తన దారిన తాను పోతున్నాడు.

గొంతు సవరించుకొంటూ " ఓ! వాల్మీకి! ఊర్లోకి వెళ్ళుతున్నట్లు ఉన్నావు. వారికి బుద్ధి వచ్చేలా నాలుగు మంచి మాటలు చెప్పు. ఆ నమ్మకం నాకుందిలే!" అని ముసలి పురుగు తన ఇంటివైపు నెమ్మదిగా అడుగులు వేసింది.



-పుల్లా రామాంజనేయులు
9491851349

---

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 144వ రోజు 'మహిళా దినోత్సవం' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. 'మహిళా దినోత్సవం' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.. – సంపాదకులు



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

### ఇంటికి దీపం ఇల్లాలు

దీపం ఉంటే ఇంట్లో కాంతి
ఇల్లాలు ఉంటేనే ఇంట్లో శాంతి
ఆలి ఉంటేనే క్రాంతి
లేకుంటే అశాంతి!!.
త్రిశక్తి రూపం మగువ
సహనంలో అవని అతివ
పని ఫలభారంలో తరువు తరుణి
సంస్కారపథంలో సతీ దేవి
శాంతి సహజీవనంలో సాధ్వి!!.
పుట్టింట్లో పుట్టెడు పనులు నేర్చుకుని
ఆటపాటలతో బాల్యం గడుపుతూనే
సంసారంలో అమ్మకు అండగా నిలుస్తూ
చదువులో ముందడుగు వేస్తూనే
అన్ని విద్యల్లో ఆరితేరుతున్న మహిళ!!.
మెట్టినింట అడుగుపెట్టి
తనదైన లోకంలో చరిస్తూ
అందరినీ మెప్పిస్తూ
సహనమే ఊపిరిగా చేసుకుని
ఇంటిని నడిపిస్తున్న ఇంతి!!.
మగువే కదా మగవానికి
వెన్నుదన్ను
మగువే కదా ఇంటికి రక్షించే కన్ను!!.
తెల్లవారి లేచింది మొదలు
కాలంతో పోటీపడి అష్టావధానమే చేస్తుంది!!.
ఉద్యోగ జీవితం ఒకవైపు
సంసార భారం ఒకవైపు
కావడికుండల్లా మోస్తూ
పిల్లలను కంటికి రెప్పలా కాపాడి
కాంతులు పంచే ఇంటి జ్యోతి
ఇల్లాలుకు సాటి లేదు
ఇంటికి దీపం ఇల్లాలే!!.



-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి,
9490367383

### ఏడాదికొక్కనాడు

ఏడాదికొక్కనాడు
మహిళా దినోత్సవమని చేస్తారు
ఏడాదంతా
మా దినాలు చేస్తూనే ఉంటారు
బయటికెళ్లినవారు సరే
ఇంట్లో ఉన్నవారికీ దిక్కులేదే!!.
మనది పేరుకు
దేవతలను పూజించే దేశం
మమ్మల్ని దేవతలుగా పొగుడుతూనే
మాపై దుర్మార్గాలు చేస్తారు
మాకు పెద్ద పెద్ద పేరులొద్దు
మోసం చేసే బిరుదులొద్దు
మమ్మల్ని మనుషుల్లా చూస్తే చాలు.
మా శరీరాలకు
నొప్పులూ బాధలుంటాయనీ
మా మనసులు
ఆత్మీయత ఆవేదన
ఆవేశాలకు స్పందిస్తాయనీ
మీరు గ్రహిస్తే చాలు!!.
మేమూ
ప్రేమిస్తామనీ
కోపిస్తామనీ
శాపిస్తామనీ
మీరెందుకు అర్థం చేసుకోరు!!.
శారీరకంగా మీకంటే తక్కువ బలం కలిగినా
ఓపికలో తెలివిలో నైపుణ్యంలో
మాతో మీరు పోటీ పడగలరా!!.
మనుషులంతా సమానమనే
కనీస అవగాహన లేని
మంచి మానవత్వాలకు
అర్థం తెలియని మీరు
మేమే గొప్ప అని చెప్పుకోటానికి
సిగ్గు వేయదా!!.



-నాగిరెడ్డి అరుణ జ్యోతి,
9966181561

### మహిళాకీర్తి

మహిళా ఓ మహిళా
అనంతం నీ కీర్తి
విశ్వ శాంతికి స్ఫూర్తి.
సీత అనసూయ
సావిత్రి గార్గేయ మైత్రేయి
పంచ కన్యలు
వారి బాట మనకు ఆదేశం.
ఇందిర సరోజినీ నాయుడు
మదర్ థెరిస్సా
బచేంద్రీ పాల్ పిటి ఉష
ఈ తరం ఆదర్శం
నేటి తరానికి వారసులుగా
తీర్చి దిద్దిన ఘనత వారిదే.
మమత సమత మానవతా
అంతా నీకే సొంతమని
సాటిలేని కీర్తి జగతికి
పంచిన మహిళా
ఓ మహిళా
తల్లిగా చెల్లిగా
భార్యగా బిడ్డగా
అంతా నీవే
వనితా
ఓ వనితా
సహనం శాంతం సౌశీల్యం
పుణ్య భూమిలో పంచాలని
అష్టలక్ష్మిగా
శాంతి దూతగా
జగతికి పంచిన మహిళ!!.



-నారు మంచి వాణి ప్రభాకరి,
9849481823

### అస్తిత్వం

అభిమానం కనిపిస్తే
సాదరంగా ఆహ్వానించి
అభినందన వస్తే
సంతోషంగా స్వీకరించి
అనుమానం క్రీగంట చూస్తే
తొలగించేందుకు చర్చించి
అవమానం తమను తాకాలని చూస్తే
అధఃపాతాళానికి తొక్కేసి
అపజయాలు చుట్టుముడితే
పోరాడి ఓడించే ఆత్మవిశ్వాసాలుగా
ఆశలు నిరాశలుగా మారే క్రమంలో
పునరుజ్జీవం పొందే
సంకల్ప శక్తులు మహిళలు!!.
కష్టం నష్టం భయపెడితే
ఎదురొడ్డి ఎదుర్కునే ధీరవనితలు
ఆనందానికి ఆత్మబంధువులు
అనురాగానికి నిలువెత్తు రూపాలు
ఆత్మీయతకు
ఆహ్లాదానికి
ప్రేమకు వారే
చిరునామాలు!!.
అందరినీ ఆదరించే స్థితప్రజ్ఞులు
ఈ సృష్టి చైతన్యానికి
వారే కదా పునాదులు
ఆకాశంలో
సగం మహిళామణి!!.



- వై. మంజులత,
9396983346

### మహిళా చైతన్యం మన నుండే

మన కవి సభలల్లో
వేదికలపై
ఒక్క మహిళ లేకున్నా మిన్నకుంటాం!!
చట్ట సభల్లో మాత్రం
మూడో వంతు కోసం పోరాటం చేస్తాం!!.
కంటి ఎదురుగా జరుగుతున్న
అన్యాయాన్ని ప్రశ్నించం!!
ఎక్కడో మహిళలకు ఏదో జరిగిందని
దవడలు నొక్కుకుంటాం!!.
ముందు వరస మనది కాదని
మనసులో అనుకుంటాం!!
ముందుకు వెళ్ళకుండా
వెనకెనకే అయిపోతాం!!.
ఆకాశం లో సగం వద్దు మనకు!!
అవకాశాల్లో సగం కావాలి!!
అవని మీద మనం పాదం
గట్టిగా మోపగలగాలి!!.
ఇప్పటికైనా
మనకోసం మనం
మన భవిష్యత్తు వారి కోసం మనం
అడుగడుగునా ఎదురవుతున్న
ఈ వివక్షను ఎదుర్కొందాం!!.
మహిళా సాధికారతే మా లక్ష్యం అంటూ
ఊకదంపుడు ఉపన్యాసాలిస్తూ
మహిళా దినోత్సవం ఒక తంతు లాగా చేస్తూ
తెల్లారాక ఆ విషయం మర్చిపోయే
నాయకులను విస్మరించండి
మీలో మీరే నడుం బిగించండి
ప్రతి మహిళ ఒక ఉక్కు పిడికిలి అయితే
సాధించలేనిది ఏదీ లేదని గ్రహించండి!!.
రాజకీయ వేదికలు కాదు
కవితా వేదికలపై మన శాతం ఎంత??
ఛారిటీ మన ఇంటి నుండే ప్రారంభం కావాలి!!
సహృదయులే
మన సోదరులు కూడా
మీ తోటి
సోదరీ కవయిత్రులను వేదికలెక్కించండి
యత్ర నార్యస్తు....అంటూ స్తోత్రాలొద్దు!
ఆచరణ లో చూపండి!!.
పత్రికల్లో ప్రసారమాధ్యమాల్లో
వ్యాసాల్లో ఉపన్యాసాల్లో
మాత్రమే కనిపించే స్త్రీ పురోగతి
మనం చేయి చేయి కలిపి
సంఘటిత శక్తి గా మారి నిజం చేద్దాం!!.
ఎవరో వచ్చి ఏదో చేస్తారని
ఎదురు చూడడం ఎందుకు నేస్తం....
స్త్రీ పురోగతి
మన నుండే మొదలుపెడదాం....



- పరిమి వెంకట సత్యమూర్తి,
9440720324

### మహిలో మహిళా

మహిళా... ఓ మహిళా...
అవనిలో సగం నీవు
ఆకాశంలో సగం నీవు
పురుషుడిలో సగం నీవు
బిడ్డల మదిలో పూర్ణం నీవు
జరుగుతున్న అన్యాయం
గ్రహించి వంటింటి నుంచి
బైటకొచ్చి
విద్యలెన్నో నేర్చావు
అందలాలలెన్నో ఎక్కావు
ఎందరికో స్ఫూర్తిగా నిలిచావు!!
ఎంతపైకి ఎదిగినా
బిడ్డగా తల్లిగా
ఇల్లాలిగానే ఒదిగి
పోయావు
శరీరం కోమలం
మనసు దృఢం
సంకల్పం ఉక్కు
మొక్కవోని దీక్షతో
దేనికయినా ఎదురొడ్డి
నిలిచి గెలిచే
పోరాట పటిమ నీది!!.



- మోటూరి శాంతకుమారి,
8106790978

### ఆవేదన

మనిషి ఎంత ఉన్నా
మనిషి గుండె పిడికిలంత
ఆ పిడికిలి అంత గుండెకు
ఎంత వేదన ఆవేదన!!.
మనసు గుట్టు
మడిచిన ఆ పిడికిలి లోనే ఉంది!!.
ఆశీర్వచనాలు ఇచ్చే ఆ హస్తం
అవసరమైతే
పిడికిలి బిగిస్తే
అవుతుంది ఆయుధం
మహాయుధం!!.
ఓ మహిళా!!
అబలనని
అర్థిస్తున్నావా
ఆయుధం లేనిదాన్నని ఆలోచిస్తున్నావా
ఎదురు తిరిగి చూడు
ఇక నీకు ఎదురే లేదు
భయపడినంత కాలం
లోకం భయపెడుతూనే ఉంటుంది!!.
సత్తువ లేనిదని
నిస్సహాయ అంటూ
నిరసిస్తూ ఉంటే
ఈ సమాజం నిన్ను
పాతాళంలోకి తొక్కేస్తుంది
బలమంతా నీలోనే ఉందని
నిన్ను నీవు తెలుసుకున్నప్పుడు
నీ పిడికిలే నీకు ఆయుధంగా మారి
వెకిలి చేష్టలతో వెక్కిరించే
ఆకతాయిలను
తుదముట్టించే
వజ్రాయుధం అవుతుంది!!.



-లింగంపల్లి హేమలత,
94925 73206

### మహిళా రక్షణ కవచం

మహిళలకు రక్షణ కవచమై
మదమెక్కిన కీచకుల పాలిట సింహస్వప్నమై
వెలసిన మరో కాళికా అవతారం
తెలంగాణా మహిళా రక్షణ బృందం!!.
నిలువెల్లా కళ్ళయి విహంగ వీక్షణం చేస్తూ....
పోకిరిగాళ్ళ భరతం పట్టే
మహిళా పోలీసు నేస్తం
మహిళలకు ఆపన్న హస్తం!!.
భుక్తి కోసం బువ్వకోసం
బతుకుదెరువును చూపే
చదువు కోసం
వీధిలో కొచ్చిన ఆడపిల్లలను
తనకో అమ్మ అక్క చెల్లి వున్నారన్న
ఇంగిత జ్ఞానాన్నిమరచి
విచక్షణా రహితంగా ప్రవర్తించే
ఓ కామపిశాచుల్లారా!.
కాచుకోండి
మీ ఆగడాలను అంతమొందించి
ఆడపిల్లకు రక్షణగా నిలిచే మహిళా
పోలీసు దళాలు పహారా
కాస్తున్నాయన్న సంగతి తెలుసుకోండి!!
ఆవేదనకు గురై ఆత్మవిశ్వాసం కోల్పోయి
నిరాశ్రయులైన అమ్మాయిలకు బతుకుపై
భరోసా కలిగిస్తూ....
కంటికి కనురెప్పలా కాచే
ఉక్కు కవచాలు స్త్రీ రక్షక దళాలు
పోకిరిరాయుళ్ళ పాలిట కాలయముళ్ళు!!.
మఫ్టీలో వుంటారు
మరుక్షణంలో వాలిపోతారు
అమ్మాయిల రక్షణలో
అలుపెరుగక సాగుతున్న
ఓ మహిళా పోలీసు బృందమా!!
ఈ మహిళా దినోత్సవాన
మీరింకా ఇంకా శక్తివంతమవ్వాలి
మీ తడాఖా చూపించాలి
లోకమంతా
మీకు జేజేలు పలకాలి!!.



- గాండ్ల వీరమణి,
9912540121

### అబలే సబల

ఆనాటి నుండి ఈనాటి వరకు
అబలవో సబలవో తెలియని సందిగ్ధం
వలువలు ఊడ్చినా
పాచికలాడి నిన్ను ఓడినా
చూలాలివై కారడవులకు వెళ్ళినా
నువ్వు అబలవాసబలవా!!
సభలలో నీ పాండిత్య ప్రతిభ చూపినా
కావ్యాలు రాసినా సేద్యం చేసినా
రాణివై కదనరంగంలో కదం తొక్కి
శత్రు సంహారం చేసి రాజ్యాలేలినా
అవని నుండి అంబరం దాకా
అన్ని రంగాల్లో శక్తి యుక్తులు
ప్రదర్శించి రాణించినా
నీ రక్షణ విషయంలోఎందుకు
అబలవవుతున్నావు!!.
అందాల బొమ్మవే
సన్నజాజి తీగవే
సంపంగి రెమ్మవే
నీ దేహం అంగాంగ వర్ణనలతో
పూలు పండ్ల మయమే!!!
పొగడ్తలకు పొంగి నిరాశతో కృంగి
ఆకాశానికేసి చూస్తున్న నీకు
ఏముందక్కడ?
శూన్యమేగా!!
ఆ శూన్యంలోకి వెళ్లిన నీకు
భూమ్యాకాశాలు
రక్షణ కవచాలు కాలేకపోయాయి
నీవు లేనిదే భూమి లేదు
నీవు లేనిదే ప్రపంచం లేదు
నీవు లేనిదే సృష్టి లేదు
అటువంటి నీవు
నీ రక్షణ విషయంలో
ఎందుకు బేలవవుతున్నావు!!
ఓ మహిళా
ఈ కాముక సమాజం మీద తిరగబడు
అప్పుడు
మహిళా"దిన" ఉత్సవం కాదు
మహిళా "మహోత్సవాలు"
జరుపుకోవాలి!!



- మన్నె (పిన్నక) లలిత,
7416863289

### ఆడపిల్లలు కాదు... అగ్గిపుల్లలు

ఓ అమాయకపు అమ్మాయిల్లారా!
మీరు
కమ్మని కలలు కనే
కన్నె పిల్లలే కావొచ్చు
కామాంధులు
మీ కలలను కాలరాస్తే
మీలో నిగ్రహం నశిస్తే
మీరు ఉగ్రరూపం దాల్చి
ఉన్మాదుల గుండెల్ని
చీల్చే కలకత్తా కాళికలన్న
నగ్నసత్యాన్ని కలనైనా మరువకండి!!.
ఓ అమాయకపు అమ్మాయిల్లారా!
మీరు పూరి గుడిశల్లో పుట్టి వుండవచ్చు
గాండ్రించే
మానవ మృగాలను చీల్చిచెండాడే
కారడవిలో చిరుతపులులన్ననగ్నసత్యాన్ని
కలనైనా మరువకండి!!
ఓ అమాయకపు అమ్మాయిల్లారా
మీరు ఆకారానికి
ఆడపిల్లలే కావచ్చు కానీ
మీరు అన్యాయాలకు
అక్రమాలకు పాల్పడే
చిత్రహింసలకు ఘోర
అవమానాలకు గురిచేసే
అక్రమార్కులను అంతంచేసే
అగ్గిపుల్లలని
కాంతి దివ్వెలని
కాల్చిబూడిద చేయగలరన్న
నగ్నసత్యాన్ని కలనైనా మరువకండి!!
ఓ అమాయకపు అమ్మాయిల్లారా!
మీరు అబలలే కావొచ్చు
అమ్ముడుపోవడానికి
మీరు అంగడిబొమ్మలు కాదని
మీరు ఆదిపరాశక్తికి ప్రతిరూపాలన్న
నగ్నసత్యాన్ని కలనైనా మరువకండి!!.



-పోలయ్య కవి కూకట్లపల్లి,
9110784502

### నారీరథం

కదిలింది కదిలింది
నారీరథం కదంతొక్కుతూ
పదం పాడుతూ
అభ్యుదయ పథాన!!.
మొలకగా వున్న పిల్లలం
మొక్కగా మారి చెట్టుగా ఎదిగాం
కలం పట్టి
గళం విప్పి
ఇంటా బైటా మన్నన పొందాం!!.
ఆటపాటల్లో
మాకు మేమేసాటి
లేరెవ్వరూ మాకు పోటీ
మొల్ల రుద్రమ ఐలమ్మ మాకు ఆదర్శం!!
చీపురు చేతబట్టి
పరిసరాలను శుభ్రపరుస్తాం
చేటలతో ధాన్య రాశులు కొలుస్తాం!
అధ్యాపకులమై అలరిస్తాం
ఆస్పత్రి నర్స్ డాక్టర్ గా ప్రాణాలు
నిలుపుతాం
పోలీసుశాఖ లో మెరుస్తాం
షీ టీం లో దారి చూపిస్తాం!!
సైన్యంలో మేమే
దేశరక్షణలోమేమే
శాస్త్రవేత్తలు ట్రక్ రైల్ డ్రయివర్లుగా
బస్సు కండక్టర్ గా
రాణించి దేశాధిపతిగా ఎదుగుతాం
భరతమాత
ముద్దు బిడ్డలం మేము!!.

-ఎ.రాజ్యశ్రీ,
8985035283

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.